మళ్ళీ గులాబీ
ఇచ్ఛాపురపు జగన్నాథరావు

"—హేపీ బర్త్‌డే!"

గాఢమైన నిద్రలో ఉన్న రేఖకి ఆ మాటలు ఏదో కలలోలాగ వినిపించాయి.

"హేపీ బర్త్‌డే, రేఖా!"

కొంచెం సంగీతం పాడుతోన్నట్టు మళ్ళీ ఆ మాటలు వినిపించాక రేఖ కళ్ళు తెరిచింది.

ఎదురుగా నిలబడి చేతిలో పుష్పగుచ్ఛంతో స్వచ్ఛంగా చిరునవ్వుతో గోపాల్ కనిపించేడు.

రేఖ లేచి కూర్చుని కళ్ళు నులుముకుని బెడ్ పక్క గడియారం చూసింది. ఏడు దగ్గరపడుతోంది.

"అరే! అలారమ్ కొట్టలేదా?" అంది దిగుతూ.

"కొట్టలేదు...ఎందుచేతనో తెలుసా?" అన్నాడు గోపాల్.

"ఏం?"

"ఆపేశాను."

"ఎందుకని?"

"చెప్పేనుగా! హేపీ బర్త్‌డే హేపీగా ఉండాలంటే ఉదయమే అలారమ్ కొట్టకూడదని రూలు...నీకు తెలీదులే...కాని, ఈ పువ్వులు తీసుకుని ఒక చిరునవ్వు వొదిలేస్తే నేను మిగిలినపని చూసుకుంటాను" అన్నాడు గోపాల్.

రేఖ అతని మాటలకి చిరునవ్వుతో జవాబిచ్చింది...త్వరత్వరగా ఆమె క్రిందటి ఏడెనిమిది నెలలలోనూ అతనితో పరిచయాన్ని నెమరు వేసింది... తానెప్పుడూ తన జన్మదినాన్ని గురించి అతనితో మాట్లాడలేదు...అతని కెలాగ తెలిసిందో!

నిజానికి తానే మరిచిపోయిన వివరం అది...

"ఈ బుకే కూడా తీసుకుంటే..."

రేఖ అతన్నలాగే నిలబడమని సంజ్ఞచేసి టూత్ బ్రష్‌తో బాత్‌రూమ్‌కి పరిగెట్టింది. ఆమె ముఖం కడుక్కుని బొట్టు పెట్టుకుని వొచ్చేదాకా అతనలాగే నిలబడి ఉన్నాడు.

"సారీ..."

"నాటెటాల్!" అంటూ ఆమె చేతిలో బుకే పెట్టేడు. ఆమె వాటిని వాసన చూస్తూ 'థేంక్స్' అంటూంటే గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు

"నాటీ" అంది రేఖ.

"నా డ్యూటీ" అన్నాడు గోపాల్. ఆ ఒక్క-క్షణమూ ఆమె కావాలనో, తెలియకో అతని కౌగిలిలో కుంచించుకు పోకపోవడం అతనికి సంతోషం కలిగించింది.

బుకే డ్రెస్సింగ్ టేబిల్ మీద పెట్టి రేఖ కిచెన్‌లోకి వెడుతూ, "నా డ్యూటీ–మీకు టీ ఇవ్వడం...గంట ఆలస్యం అయింది..." అంది.

గోపాల్ ఏమీ అనలేదు.

కిచెన్‌లో ట్రేలో టీ సిద్ధంగా ఉంది. తీసి తెస్తూ, "మీరు టైముకి నన్ను లేపితే చాలుగదా! ఎందుకు మీకి శ్రమ?" అంది రేఖ. టీ కలిపి అతని కిచ్చింది.

"టీ లవ్‌లీగా ఉంది..." అన్నాడు, సిప్ చేస్తూ గోపాల్.

"మీరు చేసిన టీ...కనక!" అంది రేఖ.

"థేంక్స్! ఆ కాంప్లిమెంటు కోసమే అన్నాను" అన్నాడు గోపాల్. టీ తాగేసరికి పూర్తిగా తెలివి వొచ్చింది రేఖకి.

"అరే! మీ రింత తీరుబాటుగా ఉన్నారేం?" అంది, కంగారుగా.

"ఏం?..." అన్నాడు మరో కప్ టీ చేసుకుంటూ గోపాల్.

"ఫేక్టరీకి వెళ్ళరా?"

"వెళ్ళను."

"ఏం?"

"ఇవేళ-సెలవు డిక్లేర్ చేశాం. అంటే...భార్యల పుట్టినరోజులు ఉన్న భర్తలకి,...అంటే, సంవత్సరం దాటకుండా పెళ్ళి అయిన వాళ్ళల్లో..."

"అలాగా!" అంది రేఖ. అతని ఫేక్టరీలో వెయ్యిమంది పైగా ఉన్నారు. అంచేత ఈ రోజు కనీసం ముగ్గురు భార్యల పుట్టినరోజులై ఉంటాయి.

"అవును" అన్నాడు గోపాల్..." ఇవేళ మనం చిన్న పండగలాగ చెయ్యాలి. సెలబ్రేషన్. ఏం?" అన్నాడు అదే ధోరణిలో.

"ఏమిటా సెలబ్రేషన్?" అంది రేఖ.

"లంచీ, డిన్నరూ...బయటికి పోదాం...డిన్నరుకి మన గెస్టులందరూ తాజ్ ఎన్నికచేశారు..."

"ఏం...ఏదైనా లాటరీ కొట్టేరా?" అంది రేఖ కొంచెం ఆశ్చర్యంగా.

"లేదు-కాని అంతా బడ్జెట్‌లో సరిపోతుంది. భయపడకు–ఈ ఇల్లు అమ్మే ప్రయత్నం అక్కరలేదు...కనీసం, ప్రస్తుతానికి" అన్నాడు గోపాల్.

"ఈ ఇల్లు కొనేవారెవరు లెండి–కనీసం, మీరు అమ్మితే!" అంది, లేస్తూ, రేఖ.




"కూర్చో...కూర్చో..."

"నాకు భైమవుతోంది..."

"దేనికీ ?"

"ఆఫీసుకి-మా వాళ్ళు సెలవు డిక్లేర్ చెయ్యలేదుగా !" అంది రేఖ.

"పొరపాటు...నాది. నీకూ ఇవేళ సెలవు."

"ఇదేమిటి ?"

"మీ బాస్‌తో మాట్లాడేను "

"ఎప్పుడు ?"

"ఉదయం ఆరుగంటలకి నేను లేచి చేసిన పనుల్లో అదొకటి. అతను ఆరుం పావుకి లేవడని అనుకోలేదు...గుడ్ మార్నింగ్ చెప్పేనులే. నేనని తెలిసేసరికి మానవుడు మానవుడిలాగే మాట్లాడేడు !...నీకు శుభాకాంక్షలు చెప్తానన్నాడు."

రేఖ ముఖంలో వొస్తోన్న విచిత్రమైన మార్పులు గమనిస్తూనే ఉన్నాడు గోపాల్. నవ్వి, "భయపడకు...అతనికి నువ్వంటే చాలా అభిమానం... ఒక్కరోజు నువ్వు వెళ్ళకపోతే ఏమీ అనుకోడు !" అన్నాడు గోపాల్ సిగరెట్ వెలిగిస్తూ.

నిలబడి ఉన్న రేఖ నీరసంగా కూర్చుంది. సిగరెట్ పొగ ఆమెకు గిట్టదు. గాని, ఆ క్షణంలో అక్కడినించి లేచి వెళ్లే ఓపిక లేకపోయింది.

బాస్ !

జీవన్‌కుమార్...

అతనికి తానంటే చాలా అభిమానం అని చెప్తున్నాడు గోపాల్ ! నవ్వుతూ చెప్తున్నాడు.

"ఏం రేఖా ! అలా ఉన్నావేం ?"

రేఖ మాట్లాడలేదు. శక్తి పుంజుకునేసరికి గోపాల్ లేచి ఆమెని బెడ్‌రూమ్ లోకి తీసుకెళ్ళాడు.

"నాలుగురోజులనించి మరీ నీరసంగా ఉన్నావు నువ్వు-కొంచెంసేపు నిద్ర పోయి లే..." అన్నాడు.

"అక్కర్లేదు..." అంది రేఖ లేవడానికి ప్రయత్నిస్తూ.

"పోనీ అలాగ కూర్చో...ఏదో ఒక టైము చూసుకుని ఈ రోజే డాక్టర్ దగ్గరికి వెడదాం" అన్నాడు గోపాల్. ఆమె ముఖం రక్తవిహీనంగా ఉంది. ఎప్పుడూ చాలా ఉత్సాహంగా, జీవనరాగం ఉట్టిపడుతూ ఉండే మనిషి కాదు రేఖ. కాని ఇవేళ మరికొంచెం కళారహితంగా ఉంది ఆమె.

దిండుకి జేరబడి కూర్చుని అతన్ని పట్టి పట్టి చూసింది. ఎనిమిదినెలల కిందట ఈ మనిషి ఎవరో ! తానెవరో ! ఈనాడు ఈ గదిలో తన పక్కన కూర్చుని చెంపలమీద చేతులు వేసి ఒళ్ళు వేడిగా ఉందేమోనని చూస్తున్న ఇతనికీ తనకీ ఎలాగ విధాత కలిపేడో !"

"టైగర్ ఇంకో గంటకి కాని రాడు—కొంచెం టిఫిన్ తెచ్చేదా ?" అన్నాడు గోపాల్.

"వొద్దు వొద్దు...మీ కాకలిగా ఉంటే నేను చేసిఇస్తాను" అంది మళ్ళీ లేవబోతూ, రేఖ.

"అదేంలేదు—ఒక గంట పడుకో. కాస్త విశ్రాంతి తీసుకో ! ఆరునెలలనించి వరుసగా వారం రోజులు కాకపోతే నాలుగురోజులైనా రెస్టు లేదు నీకు !"

వాదించి లాభం లేదని, వెనక్కి జారబడి, కళ్ళు మూసుకుంది రేఖ. చిందర వందరగా వొస్తున్నాయి ఆలోచనలు...గోపాల్ ఇదంతా చెయ్యడం ఆమెకి తృప్తినీ అసంతృప్తినీ కూడా కలిగించింది. తన పుట్టినరోజు మాట తనకి జ్ఞాపకం ఉన్నా ఆ విషయంలో గోపాల్ సందడి ఏదీ చెయ్యాలని ఆమెకి లేదు.

వొచ్చే ఆలోచనల్ని అదుపులో పెట్టకుండా వెంటనే తనకి అనిపించిన విధంగా చేసే పద్ధతి అతనిది...కాని...కాని...ఉదయంనించీ అతని ఆత్రతా, చేసిన ప్రయత్నాలూ రేఖకి కొంత చిత్రంగా ఉన్నాయి.

ఆలోచనలలోనే నిద్ర పట్టేసింది రేఖకి.

లేచేసరికి తొమ్మిది దాటింది. ఉత్సాహంగా ఉంది ఆమెకి. బహుశా ఈ విశ్రాంతి చాలా ఉపయోగకరంగా ఉందన్నమాట!

గోపాల్ టెలిఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతూ ఆమె రావడం చూసి, "రేఖ ఇక్కడ ఉంది...ఆమెతోనే మాటలాడండి" అంటూ రిసీవరు ఆమె కిచ్చేడు. ఎవరని కళ్ళతోనే అడిగి, రెండు చేతులూ గాలిలోకి ఎగరవేసిన గోపాల్ ఉద్దేశం అర్థంకాక, రిసీవరు తీసుకుని, "హల్లో" అంది నెమ్మదిగా.

"మెనీ హేపీ రిటర్న్స్" అన్నాడు జీవన్.

రేఖ తనకి తెలియకుండానే జీవన్ శుభాకాంక్షల కోసం ఎదురుచూసినా, ఆ మాటలు ఆమెని కదలించాయి. ఏదో ఒక టైముకి జీవన్ తప్పక తనకి శుభాకాంక్షలు చెప్తాడని ఆమెకి తెలుసును...కాని, ఎంత నిశ్చయం ఉన్నా, అది జరగడంలోనే నిజమైన సంతృప్తి.

"థేంక్యూ" అంది రేఖ.

ఎంత చిన్నమాట! కాని అందులో ఎంత బరువు ఉందో, ఎంత కృతజ్ఞత ఉందో అతనికే బోధపడుతుంది. ఎంత బాధ ఉందో అతనికి తెలుస్తుందా?

"మీ వారిని ఒక కోరిక కోరాను" అన్నాడు జీవన్.

గోపాల్ అని అనలేదు జీవన్ 'మీ వారు....'

"ఏమిటి?"

"రాత్రి డిన్నరు...నేనివ్వాలని ఉంది..."

"ఆయన...ఏదో ఏర్పాటు చేశారు" అంది రేఖ. అతని గొంతుక వినిపిస్తే ఆమెకి వొచ్చే థ్రిల్‌తో నీరసం కూడా వొస్తుంది. టెలిఫోన్‌లో, ప్రత్యేకంగా... అలాగ.

"అవును. నన్నూ పిలిచేరు."

"రండి."

"నీకు తెలుసును... రావడమూ... మానడమూ—రెండూ నాకు కష్టమైనవే నని...కాని, రావాలని ఉంది."

"తప్పకుండా రండి. గోపాల్ చాలా సంతోషిస్తారు."




"వాస్తాన్లే...కాని, అది నా డిన్నర్..." అన్నాడు దృఢంగా, జీవన్.

"ఆయన...ఏదో ఏర్పాటుచేశారు."

"నాకు తెలుసును. అందుకే ఈ రిక్వెస్టు..."

"ఆయనని అడగండి."

"అడిగేను...నిన్నడగమన్నాడు."

గోపాల్ జాగ్రత్తగా వింటున్నాడు.

"మీ ఇద్దరికీ ఎలా ఇష్టమైతే అదే నా యిష్టం..." అంది రేఖ ఇంక అనేదేమీ లేక.

"అయితే... సెటిల్డ్...తాజ్‌లో ఏడున్నరకి...మరీ ఆలస్యం అయితే బాగుండదు."

అతను ఫోన్ పెట్టేశాడు.

"ఏమంటాడు?" అన్నాడు గోపాల్.

"తాజ్‌లో-ఏడున్నర..."

"గెస్టుల పేర్లన్నీ అడిగ్గాడు."

"అతను..."

"కానీ...కాదన్నా ఒప్పుకోలేదు...టిఫిన్ తెచ్చేను. తిందామా ?" అన్నాడు గోపాల్ మాట మారుస్తూ.

"స్నానంచేసి వొస్తాను" అని, వెళ్ళింది రేఖ.

అతను పేపరు చూస్తూ కూర్చుని ఆమె రాగానే ఆమెతో బాటు టిఫిన్ తిన్నాడు.

"ఇడ్లీ—బాగుంది...ఎక్కడినించి ?" అంది రేఖ. చెప్పేడు.

"అంత దూరం వెళ్లేరా ?"

"ఏముంది ? కారులోనే కదా !" అన్నాడు గోపాల్.

రేఖ ఇంకేమీ అనలేదు.

టెలిఫోన్ బెల్ మళ్ళీ మోగింది.

"మనం ఇంట్లో ఉన్నట్టు ఎవరికి తెలుసును ?" అంటూ లేచాడు గోపాల్.

"వింటే తెలుస్తుంది" అంది రేఖ.

నవ్వుతూ రిసీవర్ తీసేడు గోపాల్.

"నేను...మూర్తిని."

"ఎక్కడినించి ?"

"ఫేక్టరీనించి."

"ఏమిటి సంగతి ?"

"చిన్న సహాయం కావాలి."

"ఏమిటి ?"

"నా వైఫ్‌ని హాస్పిటల్‌కి తీసికెళ్ళాలి."

"ఏం ? ఏమైంది ?"

"మామూలే...మళ్ళీ తీవ్రమైన నెప్పి...నువ్వు కూడా లేవు—ఫేక్టరి వొదిలి రాలేను నేను..."

"తప్పకుండాను...వెంటనే వెడతాను."

"డాక్టర్ స్వామి...తెలుసునా ?"

"తెలీదు. కాని, కనుక్కుంటాన్లే..."

"థేంక్స్...ఏం ఇవేళ సెలవు పెట్టేవు ?" అన్నాడు మూర్తి.

"మా రేఖ—" అని, ఆగిపోయి మాట మార్చి. "రేఖ ఎక్కడికో వెళ్ళాలని అంది" అన్నాడు గోపాల్. అంతకు ముందు మూర్తినీ పార్టీకి పిలుద్దామను కున్నాడు. కాని అతన్ని పిలవడం రేఖకి ఇష్టం ఉండదని ఆ పని మానేశాడు.

"ఓ!...ఇద్దరూ సెలవు పెట్టి ఇంట్లో ఉండిపోయారన్నమాట" అన్నాడు మూర్తి. ఏదో దొంగతనం పట్టుకున్నట్టు అన్నాడు. గోపాల్ చిన్నగా నవ్వుకున్నాడు...అతనికి మూర్తి అంటే ఇష్టం. కాని, రేఖకి అతనంటే పడదు.

"అలాటిదేమీ లేదురే...నేను వెంటనే వెడతాను." ఫోన్ పెట్టేసి రేఖకి చెప్పేడు.

"ఆమెని డ్రాప్‌చేసి వొస్తాను" అన్నాడు.

"సరే" అంది రేఖ.

అతను రమ్మంటే వెడదామని అనుకుంది. శకుంతలని ఒకటి రెండుసార్లు రేఖ కలిసింది. పెద్ద పరిచయం లేకపోయినా, ఇలాటి సమయాలలో ఆదుకునే పాటి ఉంది.

గోపాల్ ఆమెని అడుగుదామనుకుంటూనే, కాదంటుందని అనుమానించి ఊరుకున్నాడు. అమెకై ఆమే ఈ మాట సజెస్ట్ చేసి ఉంటే అతను సంతోషించి ఉండేవాడు. కాని, రేఖ ఏమీ అనకపోవడంతో అతను బయలుదేరి వెళ్ళేడు

వెళ్ళేసరికి శకుంతల తన కోసం ఎదురుచూస్తోన్నట్టు డ్రాయింగ్ రూములో కూర్చుంది. తల్లి ఆమెని ఓదారుస్తూంది. శకుంతల రెండుచేతులూ పెట్టి కడుపు మీద నొక్కుకుంటోంది.

అతన్ని చూసి, "మీకు శ్రమ...టాక్సీలో వెళ్ళి ఉండేదాన్ని" అంది శకుంతల.

"ఫరవాలేదు...బయల్దేరదామా?" అన్నాడు గోపాల్.

"కొంచెం కాఫీ తాగండి" అంది శకుంతల.

"వొద్దు లెండి...ఇప్పుడే తాగాను" అన్నాడు నిలబడే, గోపాల్.

శకుంతల లేచి నిలబడి అడుగులు వేసే ప్రయత్నంలో జోగిపోవడం చూసి తల్లీ, గోపాల్, చెరో వేపూ పట్టుకున్నారు. ఆమెని అంత దగ్గరగా తాకడం అతనికి ఇబ్బందిగా ఉంది. కాని, ముసిలితల్లి మీద ఎక్కువ బరువు లేకుండా శకుంతల తన మీదికి ఒరిగి నడిచి కారులో కూర్చుంది.

"అయితే నేనిక్కడ ఉంటానే!" అంది తల్లి.

సరేనంది శకుంతల. గోపాల్ వేపు తిరిగి, "మా మోహన్ పదకొండుకి బడినించి వచ్చేస్తాడు..." అంది, అతను ఏదో ప్రశ్న వేసినట్టు.

"ఎక్కడికి?" అన్నాడు గోపాల్ కారుస్టార్టు చేసి.

"డాక్టర్ స్వామి...అడయార్‌లో" అంది శకుంతల.

చాలా దూరం. కాని, ఏమీ ఆలోచన పెట్టుకోకుండానే గోపాల్ డ్రైవ్ చెయ్యసాగాడు. కొంచెం దూరం వెళ్ళక "కొద్దిగా...స్లో చేస్తే నాకు కుదుపు తగ్గుతుంది" అంది శకుంతల.

ఆమెకి బాధ ఎక్కువౌతోన్నట్టు ఉంది. పాపం, మరీ చుట్టుకుపోతోంది...

స్లో చేశాడు.శకుంతల ముఖం చేతుల్లో దాచుకుంది. ఆమె ఏడుస్తోందేమోనని భయపడ్డాడు గోపాల్. దైహికమైన బాధలు తనవైతే ఎలాగో భరిస్తాడు గాని, ఇతరుల్లో వాటిని చూసే శక్తి తక్కువ అతనికి.

అడయార్ పొలిమేరలకి వొచ్చేక థియసాఫిక్ సొసైటీ పక్కన కారు ఆపి, "కొంచెం ఆగేదా. వెళ్దామా?"అన్నాడు గోపాల్, రెండు నిమిషాల ఉపశమనం ఆమెకి మంచిదేమోనని.

శకుంతల చేతులు ముఖం మీదనించి తీసింది. ముఖమంతా చెమట. కళ్ళు ఎర్రబడ్డాయి.

"పదండి...పాపం మీకు శ్రమ...." అంది.

మళ్ళీ స్టార్టు అయి వెళ్ళసాగాడు గోపాల్.

"ఇదంతా ఆయన చూసుకోవాల్సింది."

"ఫేక్టరీ దూరంగా!" అన్నాడు గోపాల్.

"అంతకన్నా దూరంగా ఉన్నవి ఇంకా చాలా ఉన్నాయి" అంది, అర్థం లేకుండా శకుంతల.

మరో పదినిమిషాలలో ఆమెని తీసికెళ్ళి హాస్పిటల్లో దింపేడు గోపాల్. ఈసారి ఆమె పూర్తిగా తనమీద ఆనుకుంది. కాని, ఆ విషయం గమనించి నందుకు తనని తానే అసహ్యించుకున్నాడు గోపాల్. బాధలో ఉన్న మనిషి.

డాక్టర్ ఆమెని పిలిచేసరికి అరగంట పట్టింది.

"వొచ్చేదాకా ఉండగలరా?" అంది.

"అలాగే" అన్నాడు గోపాల్.

అరగంట దాటినా రాలేదు శకుంతల.

గోపాల్ ఒక నర్సుని పిలిచి అడిగేడు.

ఆమె వెళ్ళి మరో ఇరవైనిమిషాల తరవాత వొచ్చి "ఆమెని ఎక్స్‌రేకి తీసికెళ్లేరు" అంది.

"ఎంతసేపవుతుంది?"

"కొంచెంసేపట్లో వొచ్చేస్తుంది" అని, వెళ్ళిపోయింది నర్సు. ఆత్రతగా




చూస్తూ చూస్తూ ఒంటిగంటకి కూడా ఆమె రాకపోతే టెలిఫోన్ చేసే ప్రయత్నం చేశాడు గోపాల్. కాని, ఉన్న ఒక్క ఫోనూ ఎంతకీ ఫ్రీ కాకపోవడంతో చివరికి శకుంతల వొచ్చేక రెండున్నరకి బయలుదేరేడు. ఈసారి నర్స్ సాయంతో ఆమెని కార్లో కూర్చోబెట్టేడు

ఆమెని వొదిలి వొచ్చేసి ఉండవలసింది...కాని, ఆమె ప్రత్యేకంగా కోరేక ఎలాగ వెళ్ళిపోతాడు ? కాకపోయినా...

అతనికి మూర్తిమీద కోపం వొచ్చింది.

చివరికి తన మీదా కోపం వొచ్చింది.

ఎందుకని, ఇలాటి పరిస్థితుల్లో ఇరుక్కోవడం ?

రేఖ ఏమనుకుంటుంది ?

తియ్య తియ్యగా ఆమెతో గడపాలనుకున్న క్షణాలు...ఇలాగ ఖర్చు అయిపోయాయి !

ఆమె కేమి సంజాయిషీ ఇవ్వడం?

"మీకు బాగా ఆలస్యం అయిపోయింది" అంది శకుంతల.

"పరవాలేదు."

ఆమెని ఇంట్లో వొదిలి వెళ్ళబోతోంటే తల్లితో పాటు శకుంతల కూడా అతన్ని భోజనంచేసి వెళ్ళమని బలవంత పెట్టేరు. కాదన్నా, వినలేదు.

"రేఖ...నా కోసం ఎదురుచూస్తూ ఉంటుంది" అన్నాడు చివరికి.

"ఇంతవరకూనా ?..." అంది శకుంతల.

"అవును" అని, జవాబుకి ఎదురు చూడకుండా వెళ్ళిపోయాడు గోపాల్. ఇంటికి దగ్గర అవుతూన్నకొద్దీ అతనికి బెరుకు ఎక్కువకాసాగింది. ఏమిటి ఇలాగ అయింది ? రేఖకి చాలా కోపం వొచ్చి ఉంటుంది...ప్రత్యేకం ఈ రోజు...అన్ని ప్రయత్నాలు చేశాక ఇలాగ, శకుంతల మూలంగా అన్నీ పాడయ్యాయి.

మూర్తి దీని కంతటికీ కారకుడు.

అతను మాత్రం ఏంచేస్తాడు ? ఇలాగ అవుతుందని కలగన్నాడా ?

అతను ఇంట్లో అడుగుపెట్టేసరికి రేఖ పుస్తకం ఏదో చదువుతోంది...

అతన్ని చూసి పుస్తకం వొదిలి, నిలబడింది.

"సారీ రేఖా ! అనుకోకుండా ఆలస్యం అయిపోయింది" అన్నాడు గోపాల్. ఆ మాటల తేలికతనం మరీ స్పష్టంగా తెలిసివొస్తోంది అతనికే.

రేఖ ఏమీ అనలేదు. ఆమె ఆలోచనలు ఆమెకే అస్పష్టంగా ఉన్నాయి. అతను వెళ్ళాక ఆమెకి మొదట కొంచెం కోపం వొచ్చింది—మూర్తి అమాత్రం అనగానే అతనంత తొందరగా ఎందుకు వెళ్ళిపోవాలో ఆమెకి అర్థంకాలేదు. ఊరిలో టాక్సీలు ఉన్నాయి—శకుంతల హాస్పిటలుకి వెళ్ళి రాలేదా ? ఈయన హడావుడిగా వెళ్ళి ఇన్ని గంటలు ఉండిపోవలసిన అవసరం ఏమిటి ? కనీసం టెలిఫోన్ చెయ్యొచ్చును గదా ! అదీ లేదు...పన్నెండుదాకా చూసి చూసి చివరికి వంట మొదలుపెట్టి, అప్పటికీ అతను రాకపోతే పుస్తకం చదువుతూ కూర్చుంది... ఇప్పుడు గోపాల్ అనేమాట...సారీ...అంతే !

"భోజనానికి లేవండి" అంది తానూ కదులుతూ.

"వొండేవా ?" అన్నాడు గోపాల్, ఆశ్చర్యంగా.

"అవును" అంది రేఖ వెడుతూ.

రేఖ వివరాలడిగినా బాగుండును—అడగకుండానే తనమీద విరుచుకుపడినా బాగుండును అనిపించింది గోపాల్‌కి. కాని ఆమె ప్రయత్నం చెయ్యకుండానే ప్రదర్శిస్తోన్న ఈ నిర్లిప్తత అతనికి చాలా బాధ కలగజేసింది.

రేఖమీద అతనికి చూచాయగా కోపం వొచ్చింది.

కాని, మరుక్షణం అతని కా కోపం పోయి దానికి బదులు జాలి కలిగింది. తన జన్మదినం గురించి రేఖ ఏమీ అడగలేదు. తానే అన్నీ చేసి, మళ్ళీ ఈ ఆశా

భంగం కలిగించేడు. మరొకటీ మరొకటీ కాదు-రేఖకి అసలే ఇష్టంలేని మూర్తి భార్య కోసం ఆమెని బాధపెట్టేడు.

ఇద్దరూ భోజనానికి కూర్చున్నారు.

సింపుల్‌గా ఉంది భోజనం.

అయిందనిపించారు. ఎదురుచూస్తోన్న ప్రమోషన్ రాగానే ఇంట్లో వంటమనిషిని పెట్టుకోవాలనుకున్నాడు గోపాల్. ఆమె కూడా తనలాగే ఉద్యోగం చేస్తోంది. రోజంతా పనిచేసి రాత్రి మళ్ళీ వంట అంటే కష్టంగానే ఉంటుందామెకి.

ఆ మాట ఇప్పుడు చెప్పేదికాదు.

గోపాల్ పడకకుర్చీలో కూర్చుని సిగరెట్ వెలిగించి ఆలోచనలో పడ్డాడు.

తనకి దూర దూరంగా ఉండిపోయి,తన సంసారానికింకా ఒక రూపు రానివ్వని రేఖని ఇవేళ సంతోషపెడదామనుకున్నాడు. ఏదో ఒకరోజుకి ఆమె అన్ని విధాలా తనది కాకపోదనీ, దానికి తాను కొంచెం ప్రయత్నించాల్సి ఉంటుందనీ నిశ్చయించుకున్న గోపాల్ ఈ రోజు ఆ ప్రయత్నానికి నాందిగా పెట్టిన తొలి అడుగు తడబడ్డది.

దాన్ని దిద్దుకునే ప్రయత్నం చెయ్యాలి...

తాను తెచ్చిన బనారస్ చీర అలాగే ఉంది.

ఉదయం ఇద్దామని అనుకుని అలాగే మరిచిపోయాడు.

ఇది సమయం కాదు.

"టైగర్ ! టైగర్ !"

రేఖ పిలుస్తోంది. పన్నెండేళ్ళ టైగర్ ఎక్కడినించో పరిగెట్టుకొస్తున్నాడు.

వాడి పేరు ఏమిటో ఎవరికీ సరిగా తెలీదు. ఒకనాడు వొచ్చాడు-పని ఇమ్మని.

రేఖ అన్నం పెడతానంది.

వొద్దన్నాడు. వాడి కళ్ళలో ఆకలి ఉంది: కాని, ముఖంలో అభిమానం ఉంది.

తాను వెనక నిలబడి చూస్తున్నాడు.

"డబ్బిచ్చేదా ?" అంది రేఖ. "ఎంత కావాలి ?"

"పని చెప్పండి...చేస్తే ఇవ్వండి."

నిటారుగా నిలబడి మాట్లాడుతున్నాడు వాడు. కొంచెం చిరిగిన బట్టలే వేసుకున్నా, హుందాగా ఉన్నాడు.

"సరేలే-అలాగ ఉన్నావు. ఏం పనిచేస్తావు ? ముందు తిను-తరవాత పని చేద్దువుగాని" అంది రేఖ.

వాడు కదల్లేదు.

"ఏం పని ?" అన్నాడు.

"మొక్కల్లో కలుపు తీసి గొప్పులు తవ్వి నీళ్ళు పొయ్యి" అంది రేఖ.

వాడు కడుపునిండా తిన్నాడు. తింటూనే మొక్కల్లోకి చొరబడ్డాడు.

"కాస్సేపు నీడలో కూర్చో-తరవాత అదంతా చెయ్యొచ్చు" అన్నాడు గోపాల్. ఆదివారం రోజున నిద్ర అంటే తన కెంతో ప్రీతి అయినా, వాడి హుషారు చూస్తోంటే జాలి కూడా వేసింది.

"ముగించి కూర్చుంటాను" అన్నాడు.

రెండు గంటలు గొప్పులు తవ్వి నీరు పట్టి కుళాయి దగ్గర ముఖం, కాళ్లు చేతులు కడుక్కుని వొచ్చేసరికి గోపాల్ నిద్రలేచి వాడికీ రేఖకీ జరుగుతున్న సంభాషణ వింటున్నాడు.

"పనంతా చేసేసేనమ్మా !" అన్నాడు టైగర్.

"సరి...ఎంత కావాలి ?"

"భోజనం పెట్టేరు కదా ! ఏభై పైసలివ్వండి."

"చాలా ?" రేఖ కొంచెం వెక్కిరింపుగా అంది, అనిపించింది వింటోన్న గోపాల్‌కి.

"పోనీ ఇరవై అయిదు..."

రేఖ నవ్వుతోంది.

"పోనీండమ్మా మీ ఇష్టం—అన్నట్టు గులాబికి గొప్పు తవ్వుతూంటే ఇది దొరికింది."

ఏమిటో చూద్దామని గోపాలం వెళ్ళేడు.

గాజు.

వర్షాల ముందునించీ కనిపించని రేఖ బంగారుగాజు.

"ఇత్తడిదా అమ్మా ?" అన్నాడు.

"కాదు బంగారం."

"మరలా ఉందేం ?"

"మన్నులో ఉండి నీలాగే ఉండిలే" అంది రేఖ. ఆమె త్వర త్వరగా గాజు శుభ్రంచేసి గోపాల్‌కి చూపెట్టింది.

నేరం చేసిన మనుషులు...

గోపాల్, రేఖ




ఆ గాజు కనిపించకపోతే పున్నమ్మమీద అనుమానపడ్డారు—నేను తియ్యలేదు అన్నమాట పున్నమ్మ అనలేదు. నువ్వు తీసేవని రేఖగాని గోపాల్‌గాని అనలేదు.

అతని మాటల్లో ఉన్న హింస ఆనేమాటల్లో ఉండదు.

వారం రోజుల తరవాత పున్నమ్మ పని వొదిలి వెళ్ళిపోయింది-చెప్పకుండానే.

ఆ నిష్క్రమణం అనుమానాలని మరికొంత ధృవపరిచింది.

పోలీసులకి రిపోర్టు ఇద్దామనిపించింది.

ఇద్దామంది రేఖ.

వొద్దన్నాడు గోపాలం .

దానిమీద చర్చ చాలా జరిగాక ఇవ్వొద్దంది రేఖ.

ఇయ్యాలని అన్నాడు గోపాలం.

అలాగే చివరికి ఇవ్వలేదు.

గాజు...గులాబీల పొదలల్లో. ఎలాగ పడింది ?

జారి ఉంటుంది.

రేఖ గోపాలం వైపు చూసింది.

గోపాలం రేఖ వైపు చూశాడు.

నువ్వూ దోషివి; నేనూ దోషిని; ఇద్దరం దోషులం అన్నట్టు ఉంది.

కాని, మనం కూడా దోషులం కామేమోనన్న అనుమానం ఉంది ఆ చూపుల్లో. ఆశ ఉంది

"ఏమిటమ్మా అలాగ చూస్తున్నారు ?" అన్నాడు టైగర్.

" పేరేమిటి ?" అంది రేఖ.

"టైగర్" అన్నాడు.

"నిజం పేరు" అంది రేఖ.

"అదే నిజం పేరు" అన్నాడు వాడు.

పదిరూపాయిలనోటు తీసి వాడి కిచ్చి, "ఇదిగో ! పట్టికెళ్ళు" అంది.

"పదిరూపాయలు దేనికమ్మా ! ఏభై పైసలివ్వండి" అన్నాడు.

"నీకు బుర్ర లేదులే. ఈ గాజు ఖరీదెంతో తెలుసా ?" అంది రేఖ.

"ఎంతైతే నాకేమమ్మా !...ఏభై పైసలు ఇవ్వండి, నా పనికి—గాజు మీది..." అంటాడు వాడు.

రేఖకి నవ్వొస్తూంది. ఈ యుగంలో ఈ శకంలో ఇంకా ఈ మాత్రం అమాయకత్వం ఉందంటే ఆమెకి ఆనందంగా ఉంది. వీడు మామూలు జులాయి పిల్లవాడు కాదు-ఆ మాట చూస్తేనే తెలుస్తోంది.

"సరే పో" అంది.

"సరే" అన్నాడు వాడు. రెండడుగులు మెల్లగా వేసి తరవాత త్వరగా వెళ్ళ సాగేడు. గేటు దగ్గరికి వెళ్లేసరికి వాడు వెనుదిరిగి చూడకుండా వెడుతున్నాడు.

"టైగర్ !" అని కేకవేసింది రేఖ, నవ్వాపుకుని.

వాడు వెనుదిరిగి చూడలేదు. గోపాలం గమనిస్తూనే ఉన్నాడు. ఈ సారి కొంచెం కంగారుగా, "టైగర్ ! టైగర్ !" అని రెండుసార్లు అరిచింది రేఖ. రెండోసారి భయంగా వినిపించింది పిలుపు కాని వాడు వెనుదిరిగి చూడలేదు.

గోపాలం ఒక్క ఊపున గేటుదాటి వడిగా సాగిపోతోన్న టైగర్‌ని ఇరవై అంగల్లో కలుసుకుని జబ్బ పట్టుకుని ఆపి, "అమ్మగారు పిలుస్తూంటే వినపడ లేదూ ?" అన్నాడు.

"నాకేం వొద్దు" అన్నాడు పట్టు వదిలించే ప్రయత్నంచేస్తూ.

"వొద్దులే–ఒకసారి రా" అన్నాడు గోపాలం.

నిశ్చలంగా నిలబడ్డాడు టైగర్.

"రా."

లాలనగా అన్నాడు గోపాలం

అనిష్టంగానే అడుగులు వేశాడు టైగర్.

రేఖ గేటువైపు ఆత్రతతో చూస్తూ నిలబడింది.

వాడి భుజంమీద చెయ్యి వేసి, "పని కావాలా ?" అంది.

"అవును..."

"మా యింట్లో ఉండు" అంది రేఖ.

వాడు క్షణం ఆలోచించి, "ఉంటాను గాని, గిన్నెలూ అవీ తోమను...ఇల్లు తుడవను" అన్నాడు.

"నీ ఇష్టం వొచ్చిన పన్లు చేస్తావా ?" అంది రేఖ.

"అవును, అన్నాడు టైగర్. రేఖ మాటలాడకపోతే, "మగపన్లు" అన్నాడు వాడు.

ఈసారి ఇద్దరికీ నవ్వొచ్చింది.

"సరే–అలాగే" అంది రేఖ

ఆ నాటి నించీ వాడక్కడే భోజనం. రాత్రి వెళ్ళి ఉదయం ఎనిమిది దాటేక వొస్తాడు...అన్ని పన్లూ చేస్తాడు. వాడి జీతం ఇంత అని రేఖ చెప్పలేదు. వాడడగలేదు. కాని, నెల నెలా వాడి పేరున ఏభై రూపాయిలు బేంక్‌లో వేస్తూంది రేఖ. నెలకి ఒక జత చొప్పున ఈ మూడునెలలూ బట్టలూ కుట్టించింది.

విచిత్రంగా ఇంట్లో ఒక మనిషి అయిపోయాడు టైగర్. రేఖకి వాడిమీద ఎంతో అభిమానం. ఈ మధ్య వాడికి చదువు నేర్పే ప్రయత్నం కూడా చేస్తోంది.

రేఖ వాడితో ఏం చెప్పిందో తెలీదు. గోపాల్ అది తెలుసుకునే ప్రయత్నం చెయ్యలేదు.

అతను చేస్తోన్న ప్రయత్నం రేఖని ప్రసన్నం చేసుకునేందుకు. కావాలని తాను పొరపాటు చెయ్యకపోయినా, ఆమె దృష్టిలో తాను నేరం చేసినమాట నిజం.

లేచి వెళ్ళి రేఖకోసం చూశాడు.

ఆమె ఏదో పుస్తకం చదువుకుంటోంది.

వెళ్ళి ఆమె పక్కన కూర్చుని, 'నీకు చాలా కోపంగా ఉంది కదూ ?"

అన్నాడు గోపాలం, జరిగినదంతా పూర్తిగా తెలిస్తే ఆమెకి కోపం ఎక్కువౌతుందో తగ్గుతుందో ఆలోచిస్తూ.

రేఖ "కోపం ఏమీ లేదు" అంది.

"థేంక్స్...అనుకున్నదానికి అంతా విరుద్ధంగా జరిగింది-ఈ రోజు నీతో నవ్వుతూ గడపాలనుకున్నాను...కాని..." అన్నాడు-ఏమనాలో తెలియక.

రేఖ సహాయం చెయ్యలేదు. ఆమె నిశ్శబ్దంగానే ఉండిపోయింది.

"అంచేత నిన్ను...క్షమించమని అడగడానికి వొచ్చేను."

రేఖ ఆశ్చర్యంగా చూసింది.

తానంటే ఎంత అభిమానంగా చూసినా, గోపాల్ ఎప్పుడూ ఇలాగ మాటలాడలేదు. ఉదయం జరిగినదానికి పాపం, అతను పూర్తిగా బాధ్యత తీసుకుంటున్నాడు!

"ఈ రోజంతా నువ్విలాగే నిర్లిప్తంగా కూర్చోడానికి వీల్లేదు-ప్లీజ్!"

రేఖ తల ఊపుతూ," మీరు క్షమాపణ చెప్పాల్సిన అవసరంలేదు" అంది.

"పొరపాటు చేసేక తప్పక అవసరం ఉంది" అన్నాడు రెండు చేతులూ ఆమె భుజాలమీద వేసి రేఖని తనవంక తిప్పుకుంటూ.

అతని కళ్ళలో ఉన్న వేదన ఆమెకి స్పష్టంగా కనిపించింది.

వందలలో రోజులు సహచర్యంలో గడిపినా, గోపాల్ ఇంతగా బాధపడటే దెప్పుడూ.

అతని ప్రవర్తన సామాన్యపరిస్థితుల్లో అనాలోచితంగా కనిపిస్తుంది. ఆ క్షణాని కేదితోస్తే అది చేసెయ్యడం అతనికి అలవాటు...ఆ విషయం రేఖకి తెలుసును. చేసినదాన్ని గురించి ఎక్కువ ఆలోచించడం, బాధపడడం, అతని పద్ధతి కాదు.

తన విషయంలో...తానతని భార్యగా వొచ్చాక-అతని ప్రవర్తన వేరు. ఏది చేసినా, ఏమన్నా, తరుచు ఆలోచించి చేసే అలవాటు ఆమె గ్రహించింది.

"మీరు పొరపాటు చేసేరని అనుకోను...క్షమించాల్సింది ఏదీ ఉందని నేననుకోను..." అని, ఆగలేక, అతని కళ్ళలోకి చూస్తూ, "నేను ఏమీ బాధపడడంలేదు...మీ రా ఆలోచన మానెయ్యండి" అంది. ఆమె నిర్లిప్తతపోయి ఆ క్షణాలలో కొంత ఆర్ద్రత అనుకోకుండానే రేఖ గొంతుకలోకి వొచ్చింది.

"నిజంగా?" అన్నాడు గోపాల్.

"నిజంగా" అంది రేఖ.



అతని చేతులు మరి కొంచెం బిగుసుకుని, విడిపోయాయి. ఆ సమయాలలో దైహికస్పర్శ ఆమెకంతగా నచ్చదని తెలుసును గనక కాని, గోపాలం ఆమెని తప్పక ముద్దుపెట్టుకుని ఉండేవాడు. అంత రిలీఫ్ వొచ్చింది.

"థేంక్స్..."

"కాస్సేపు నిద్రపొండి."

"అలాగే!"

అతను వెళ్ళిపోయాడు.

రేఖ కొంచెం బాధపడింది. గోపాలం చాలా మధనపడ్డాడని తెలిసినా, అతని అంతరాంతరాలలోకి తన నిర్లిప్తత చొచ్చుకుని వెళ్ళి గాయపరచిందని ఆమె అనుకోలేదు.

ఇందాకటి కొద్ది క్షణాలూ తియ్యగా ఉన్నాయి.

అతనితో గడిపిన క్షణాలకన్నా.

ఏవో పాత పాత క్షణాలు జ్ఞాపకం వొస్తున్నాయి.

ఎందుకో. ఆ జ్ఞాపకాలు ఆవేళ రావాలనిలేదు.

పదినిమిషాలు పుస్తకంమీద మనసు నిలుపుదామని ప్రయత్నించింది రేఖ. కాని, కుదరలేదు.

అతను నిద్రస్తోన్న గదిలోకి వెళ్ళింది. పసివాడిలాగ నిద్రపోతున్నాడు గోపాల్.

కిటికీల తెరలు వేసి, ఫేన్ వేగం తగ్గించి. అశాంతితో వెళ్ళి మళ్ళీ పుస్తకం తీసింది రేఖ

ఆమె మనస తా చిందరవందరగా ఉంది.

అతను నిద్రపోతోన్నందుకు ఆమె సంతోషించింది.

లేకపోతే...అతను మళ్ళీ బాధపడేవాడు.

అందుకే బాగా ఆలస్యంగా అతను లేచేదాకా ఆమె ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంచింది.

టైగర్ తన పనులు ముగించి చదువులో పడ్డాడు.

అదృష్టవంతుడు! వాడి సమస్యలు తీరనివి కాదు!

వాడినీ శబ్దం చెయ్యనివ్వలేదు రేఖ. తాను ఎలాగో, రావొద్దన్న ఆలోచనలు మళ్ళీ మళ్ళీ వొస్తూంటే, పుస్తకంమీద మనస్సు లగ్నంచేసి వాడిని అదుపులో పెట్టింది.

* * *

రాత్రి డిన్నర్‌కి గోపాలం ఇచ్చిన నీలి సిల్కుచీర కట్టుకుంది. ఆమెకి నగలంటే అంత ఇష్టంలేదు. సింపుల్‌గా అలంకరించుకుని గోపాల్‌తో బయలు దేరుతోంటే నిమిషంపాటు అతను తనవేపు చూస్తూ నిలబడిపోయాడు.

"యు ఆర్ వెరీ బ్యూటిఫుల్."

అన్నాడు గోపాలం...కష్టంగా కదులుతూ. రేఖ చిరునవ్వు సమాధానంగా ఇచ్చి ఏమీ అనకపోయినా, ఆమెకి విచిత్రమైన సంతృప్తి కలిగింది. ఆ క్షణాలలో అతనూ ఎంతో ఆకర్షణీయంగా కనిపించేడు.

డిన్నర్ చాలా చక్కగా జరిగింది.

అందరూ కలిసి పదిమందికన్నా లేరు.

జీవన్ భార్య రాలేదు.

"ఆమెకి సాయంత్రంనించీ తలనొప్పి" అన్నాడు జీవన్. అందరూ అనుగుణంగా సానుభూతి చెప్పేరు.

అతను నిజం చెప్పి ఉంటే, ఎలాటి రియాక్షన్ ఉండేదో!

"నీ దగ్గిర పనిచేస్తోన్న మనిషికి నువ్వు బర్త్‌డే పార్టీ ఇవ్వడం ఏమిటి. మూర్ఖత్వం!" అంది సవిత-అతని భార్య.

"వాళ్ళిద్దరూ నాకు తెలుసును" అన్నాడు జీవన్.

"తెలిస్తే?...దానికి పెద్ద డిన్నర్ ఇవ్వాలా?" అంది సవిత.

"పార్టీలు నాకు కొత్త కాదు" అన్నాడు జీవన్.

"తెలుసును...కాని, అందరూ నవ్వే పనులు చెయ్యడమూ కొత్త కాదు-రేపు మీ ఆఫీసులో తల ఎత్తి ఎలాగ తిరుగుతావు!" అంది సవిత.

"నవ్వే చూద్దువుగాని! నేనంత సిగ్గుమాలిన పని ఏమీ చెయ్యడంలేదు" అన్నాడు జీవన్ కొంచెం ఘాటుగా.

"అదేదో నువ్వే చెయ్యి...నేను రాను" అంది సవిత.

"అందరినీ పిలిచి నువ్వు రాకుంటే బాగుండదు" అన్నాడు, ఓర్పుగా, జీవన్ నూరుకిలోల ఆమె శరీరంలో నూరుకిలోల ద్వేషం ఉంది...ఏమీలేని తనకి పట్టిన ఐశ్వర్యం తాను తెచ్చాననే గర్వం ఉంది ఆమెలో.

"ఇంకా చాలా ఉన్నాయి బాగుండనివి...నేను రాను" అంది, దృఢంగా సవిత. ఒక విధంగా ఇదీ మంచిదేనని అనిపించింది జీవన్‌కి...ఆమె అక్కడికి వొచ్చి రభస చెయ్యొచ్చును. రేఖని గురించి ఆమెకి మంచి అభిప్రాయం లేదు. ఏ సాక్ష్యంగాని ఋజువుగాన్ని ఆమె దగ్గర ఉందో తెలీదుగాని, సవిత ఉండీ ఉండీ రేఖమీద ఒక విసుకు విసురుతూనే ఉంటుంది.

తొమ్మిదికి భోజనాలయి అందరూ వెళ్ళిపోయారు.

చివరి నిమిషాలలో జీవన్ ఒక్క క్షణం రేఖతో ఏకాంతంగా ఉండ గలిగాడు...అతిథులందరూ ముందు వెడుతోంటే రేఖతో అడుగులు వేసి, "సుఖంగా ఉన్నావా రేఖా ?" అన్నాడు చిన్నగా.

"మీకు తెలుసు" అంది రేఖ.

"అవును...కాని...నేను చెప్పినది మరిచిపోక...గోపాల్ చాలా ఉత్తముడు...నా ప్రెసిడెంట్..."

అతను కోటు జేబులోనించి ఎర్రటి టిస్యూ కాగితంలో కట్టిన పొట్లం తీసి త్వరగా ఆమె బేగ్‌లో పడేశాడు.

"ఏమిటది !"

"చిన్న గొలుసు..."

"వొద్దు..." అంది రేఖ

"ఉంచుకో...నా సంతృప్తి కోసం."

"ప్లీజ్ !" అంది రేఖ. ఎందుకో ఆ గిఫ్ట్ తీసుకోడం ఆమెకి సుతరామూ నచ్చలేదు.

"నా కోసం..." అన్నాడు.

మిగిలినవాళ్ళు దగ్గర అయారు.

"త్వరలో-కలుసుకుందాం" అని, జీవన్ వడిగా వాళ్ళతో కలిసిపోయాడు.

అందరూ వెళ్ళారు. రేఖ, గోపాల్ కారులో కూర్చుని హోటల్ బయటికి రాగానే, హటాత్తుగా రేఖ. "అలా బీచ్ వైపునించి పోదామా ?" అంది.

గోపాల్ ముఖంలో ఆనందం స్పష్టంగా చూడగలిగింది రేఖ-ఆమె కేవలం తన కల్లోలమైన ఆలోచనలని అదుపులో పెట్టుకోగలిగేందుకు మాత్రమే అది సూచించినా, అతనికా కోరిక ఆనందప్రదమై ఉండడం ఆమెకి సంతృప్తి కలిగించింది.

అరగంట బీచ్‌లో కూర్చున్నారిద్దరూ-

కెరటాలని చూస్తూ.

ఒకొక్కరి మనసులో కెరటాలు—ఆలోచనల కెరటాలు.

మీది నక్షత్రాలు చూస్తూ.

ఆశల్లాటి నక్షత్రాలు.

జ్ఞాపకాలలాటి నక్షత్రాలు.

చీర ఒంటికి బాగా దగ్గరగా తీసుకుంది రేఖ, చెదురుతోన్న ఆలోచనల్ని మూటకడుతోన్నట్టు.

"చలిగా ఉందా ?" అన్నాడు గోపాలం-దూర దూరాలనించి వొస్తూ.

"అవును" అంది రేఖ.

చెయ్యి పట్టుకుని లేవదీసి కారు దగ్గిరకి నడిచాడు...అక్కడిదాకా ఆమె చెయ్యి అతని చేతిలో ఉండిపోయింది.

"హేపీ బర్త్‌డే" అనుకున్నాడు గోపాల్.

హేపీ.

## 2

రెండు నెలలు మామూలుగా గడిచిపోయాయి వాళ్ళ జీవితంలో.

ఆ రోజు వొచ్చిన మధురక్షణాలు మళ్ళీ రాలేదు...అంత స్పష్టంగా, అంతసేపు.

అంతకు ముందు వాళ్ళిద్దరి మధ్యా ఉన్న దూరం మాత్రం కొంత తగ్గింది-అలా అనిపించింది గోపాల్‌కి. ఆమె కొంచెం తక్కువ నిర్లిప్తత కనబరుస్తోంది. రోజూ ఒక్కసారి అయినా ఆమె చిరునవ్వు నవ్వుతోంది. ఎప్పుడైనా తానే సంభాషణ ప్రారంభిస్తోంది. ఇంట్లో తమ మధ్య తరుచు వొచ్చే నిశ్శబ్దాల సంఖ్యా, పరిమితీ క్రమంగా తగ్గుతోంది.

ఆమె అంటే తనకి ప్రాణం...అని చెప్పాలనిపిస్తుంది ఎన్నోసార్లు. కాని, ఇలాటి మాటలు చెప్పడంలో ఏమీ ప్రయోజనంలేదు. హృదయంనించి హృదయానికి నిశ్శబ్దతరంగాల్లాగ ఆ భావన స్పందిస్తేనే దాని ప్రయోజనం. అరవై వాద్యాల సంగీత ఘోషతో పాడినా ప్రయోజనంలేని మాటలవి.

ఎప్పుడో, ఎలాగో ఆ స్పందన వొస్తుంది.

రేఖకి తాను అర్థమౌతాడు.

రేఖ కేవలం దైహికంగా, సాంఘికంగానే కాకుండా తనదైపోతుంది. ఆ రోజు కోసమే, ఆ ముహూర్తం కోసమే తను ఎదురుచూడడం.

అలా అనుకుంటూ ఆ సాయంత్రం ఇంటికి వొచ్చాడు గోపాలం. ఇంట్లో టైగర్ ఒక్కడే ఉన్నాడు.

"అమ్మగారెక్కడ ?" అన్నాడు.

"తెలీదు..." అన్నాడు టైగర్.

"ఎప్పుడు వెళ్లేరు ?"

"అయిదు గంటలకి ఇంటికి వొచ్చి...వెంటనే వెళ్ళిపోయారు."

"కార్లోనా ?"

"కాదు...టేక్సీ పిలవమన్నారు."

కొంచెం ఆశ్చర్యపడ్డాడు గోపాలం. ఎక్కడికి వెళ్ళి ఉంటుంది, రేఖ ? ఇలాగ బయలుదేరి వెళ్ళిపోవడం కొత్త అని కాదు...ఈ పదినెలలు చిల్లర రోజుల్లో ఏడెనిమిదిసార్లిలాగే...

కారు ఎందుకు తీసికెళ్ళలేదు ?

ఇలాగ వెళ్ళినప్పుడల్లా రేఖ కారు తీసికెళ్ళదు.

ఎక్కడికి వెళ్ళి ఉంటుంది ?

డ్రైవర్ టీ తెచ్చేడు.

ఈ మధ్య టీ రేఖ స్వయంగా తెచ్చి ఇస్తోంది. అంతకు ముందు ఇంట్లో ఉన్న సర్వెంటు, ఆ తరవాత డ్రైవర్...

వీడు తెస్తే ఆమె తెచ్చినట్టుండదు టీ.

ట్రే నేలమీద కొట్టి, రేఖ ఎక్కడికి వెళ్ళిందని అరవాలని ఉంది గోపాలంకి. కాని, ఇది తన ఇల్లు...తమ ఇల్లు-తనదీ, రేఖదీని. ఆమె ఇలాటి ఉద్రేకాలని భరించదు...

టీ తాగి గార్డెన్‌లో పచార్లు మొదలుపెట్టేడు గోపాలం.

అతనిలో అశాంతి పెరిగిపోతోంది.

తనకి చెప్పకుండా ఎక్కడికి వెళ్ళింది ?

చీకటిపడుతోంది.

ఆడది. తన భార్య. ఒంటరిగా, ఎక్కడ ఉంది ?

ఒక్కసారి లోపలికి వెళ్ళి రేఖ ఆఫీసుకి టెలిఫోన్ చేశాడు. రేఖ మామూలుగా సాయంత్రమే వెళ్ళిపోయిందని చెప్పేరు.

మళ్ళీ గార్డెన్‌లోకి వొచ్చి కూర్చున్నాడు.

అశాంతి ఎక్కువౌతోంది.

బాగా చీకటిపడిపోయింది.

ఎక్కడికి వెళ్ళేవని రేఖని అడగాలని అతను ఇంతకుపూర్వం కూడా అనుకున్నాడు. కాని, ఆమెకి ఎదురుగా నిలబడి ఆ మాట అడగలేకపోయాడు. వ్యక్తిత్వం ఉన్న మనిషి రేఖ...ఉద్యోగం చేసుకొంటోంది-కావాలని, ఆమెని కష్టపడి వొప్పించి, తాను పెళ్ళిచేసుకున్నాడు. కొంతమంది మిత్రులూ, పరిచ




యస్తులూ, సూటిగా కాకుండా, తిరుగుడు పద్ధతిలో ఆమెని గురించి ఏమేమో సూచించేరు. కాని, రేఖని చూస్తే ఆమె దాచుకోవలసినవీ, రహస్యమైనవీ పనులేవీ చెయ్యదని గోపాల్‌కి చాలా నమ్మిక. అదీకాక అందమైన ఆడదాన్ని చూస్తే అపవాదు వెయ్యడం చాలామందికి అలవాటు

తన చెల్లెలు-స్వంత చెల్లెలు కాకపోయినా, పినతల్లిగారి అమ్మాయి శారద-మీద ఎన్ని అపవాదులు రాలేదు ?

శారద కూడా ఎంతో అందంగా ఉండేది.

ఆమె మనస్సు ఎంతో స్వచ్ఛంగా ఉండేది

తనకి తెలుసును...చెల్లెళ్ళు లేక శారదని తన ప్రాణంకన్నా హెచ్చుగా చూసుకునేవాడు.

పసితనంనించీ శారద తనకోసం ప్రాణం పెట్టడానికైనా సరే సిద్ధంగా ఉండేది.

తనకి బాగా జ్ఞాపకం—చిన్న చిన్న దొంగతనాలు చేసినాసరే, తనకి చెప్పి మొట్టికాయలు తినేదిగాని, ఏ విషయమూ దాచేదికాదు. ఆమెకి వయస్సు వొచ్చినకొద్దీ తనమీద అభిమానం, నమ్మిక, ఎక్కువ అయాయి గాని తగ్గలేదు.

కాలేజీలో అబ్బాయిలంతా ఆమెని ఎలాగైనా పరిచయం చేసుకోవాలనీ, నోట్సు మిషతోనో, మరే కారణంతోనో, ఆమెతో మాటలాడాలనీ చూసేవారు. ఆ విషయాలన్నీ "అన్నయ్యా! ఏమయిందో తెలుసా!" అంటూ, నవ్వుతూ తనతో చెప్పేది. వాళ్ళు ఏడిపించినా తనతోనే చెప్పుకుని ఏడిచేది.

ఆమెలో మలినంలేదు.

తనకి తెలుసును.

ఆ శారదమీద ఎన్ని అభాండాలు వేశారు!

ఆమె పేరూ-మరొకడి పేరూ-గోడలమీదికి ఎక్కించేరు.

ఆమె కనిపించినప్పుడల్లా అరవడం-కుక్కలలాగ.

ఆమెతో గోడల కెక్కిన పేరు మరెవరిదో కాదు-దానికంతకీ కారణం అయినవాడిదే!...వాడు శారద దగ్గర అమర్యాదగా ప్రవర్తిస్తే ఆమె గట్టిగా బుద్ధి చెప్పిందని ఉక్రోషంతో వాడే ఇదంతా చేయించాడు. తనకి అది తెలిశాక వాడికి నమ్మకంగా దేహశుద్ధి చేశాడు గాని, పాపం! శారద ఎంత బాధపడింది! ఆమె బంగారు బొమ్మ అయినా, వొచ్చిన సంబంధాలన్నీ తప్పుతూ వొచ్చాయి. ఏ సంబంధం కుదురుతుందని ఆశపడినా, ఒక ఆకాశరామన్న ఉత్తరం ఆ ఆశని ధ్వంసంచేసేది

ఇప్పుడు అమెరికాలో ఉంది గనక శారద సుఖపడుతోంది గాని, తన దేశంలోనే ఉంటే ఆమె ఆత్మహత్య చేసుకోవలసివచ్చి ఉండేది!

రేఖమీద తనకి ఏ విధమైన అనుమానమూలేదు గాని, చింత ఉంది... అమెకి ఆమే తనకి వివరాలు ఎందుకు చెప్పదు?

అలిసిపోయి కుర్చీలో కళ్ళు మూసుకుని కూర్చున్నాడు

ఎంతసేపో!

రేఖ అలాగ మాయం అయిపోయింది, తనతో ఏమీ చెప్పకుండానని ఒకబాధ.

రేఖ లేని ఇల్లు వెలవెలబోతుంటే చూసి ఒక బాధ.

ఈ మధ్య కొంతకాలంపాటు రేఖ ఇలాగ వెళ్ళిపోవడంలేదు...అంతకు ముందూ ఆమె లేని ఇల్లు తనని వెక్కిరిస్తూ ఉంది. కాని ఈ మధ్య...రేఖ తనకి ఆమాత్రం దగ్గరగా వొచ్చిన తరవాత ఈ ఒంటరితనం భరించలేనిదిగా ఉంది.

బయట టేక్సీ ఆగింది.

వీధి దీపపు వెలుగులో రేఖ దిగింది.

యాంత్రికంగా గోపాలం టైము చూశాడు.

గడియారం తొమ్మిదిదాటిన సమయ సూచన చేస్తోంది.

రేఖ గేటు తీసుకుని వడిగా లోపలికి వెళ్ళింది.

గోపాలం అలాగే కూర్చున్నాడు. లోపలికి వెంటనే వెళ్ళాలని లేదతనికి. వెళ్ళి ఆమెతో ఏమి మాటలాడాలో తెలీదు...అసలేమీ మాటలాడాలనిలేదు.

ఇంతగా ప్రేమిస్తోన్న తన నామె ఇలాటి పరిస్థితిలో ఎందుకు పెట్టాలి?

ఎక్కడికి వెళ్ళి వొచ్చింది?

వీధి దీపం వేపు చూస్తూ చాలాసేపు అలాగే కూర్చున్నాడు గోపాల్. రేఖ వొస్తుందనీ, సందేహిస్తూ, భయపడుతూ, పిలుస్తుందనీ అతననుకున్నాడు. కాని ఎంతో ఆలస్యం తరవాత బైగర్ వొచ్చి తనని అమ్మగారు భోజనానికి పిలుస్తున్నారని చెప్పడం అతనికి ఆశాభంగం కలిగించింది. గెటవుట్! అందామని ఒక్కసారిగా అనిపించినా, ఆ ఉద్రేకాన్ని అణిచి పెట్టుకున్నాడు.

"సరే...నువ్వెళ్ళు" అన్నాడు.

వాడు అలాగే నిలబడ్డాడు.

"వెళ్ళు" అన్నాడు కోపంగా.

వాడు కదల్లేదు...రేఖ చెప్పింది కాబోలు.

అణుచుకోలేని కోపంతో లేచి బైగర్‌ని చెంపకాయ కొట్టాడు గోపాల్. లోలోపల రేఖమీదా, ఆమెని ప్రశ్నించలేని అశక్తతకి తనమీదా రగులుతోన్న కోపం ఆ ఒక్కక్షణ శకలంలో ప్రజ్వలించింది. రెండు చేతుల్లోనూ చెంపలు దాచుకుని, అడుగు మాత్రం వెనక్కి వెయ్యని బైగర్ ముఖం చూడగానే కోపం అలాగే మళ్ళీ తగ్గిపోయింది.

వాడిని లాలించాలనీ, నొప్పిగా ఉందా అని అడగాలనీ, క్షమాపణ చెప్పి పరిహారం ఏమైనా ఇవ్వాలనీ అతనికి అనిపించింది. కాని, అస్పష్టమైన భావన అతన్ని అదేదీ చెయ్యనివ్వలేదు.

త్వరగా లోపలికి వెళ్ళాడు.

డైనింగ్‌టేబిల్ దగ్గర రెండుచేతులూ కట్టుకుని నిలబడి రేఖ తోటలోకి చూస్తోంది.

గోపాల్ చేతులూ, ముఖం కడుక్కుని వొచ్చాడు.

ఆమె వడ్డిస్తోంది.

"నువ్వూ తిను" అన్నాడు.

"తరవాత తింటాను" అంది రేఖ. ఆ కంఠస్వరంలో మాధుర్యమూ లేదు, కర్కశత్వమూ లేదు.

విచిత్రంగా, తనకి ఆకలిగా ఉంది.

ఆమె నిలబడి అడగకుండానే వొడ్డిస్తోంది.

భోజనం ముగించి లేచి వెళ్ళి మరో పదినిమిషాలలో పడుకుని జర్నల్ ఏదో చదవసాగేడు గోపాల్...జరిగినదంతా చెరిపెయ్యాలని ఉంది. రేఖని క్షమించాలని ఉంది. ఆమెని తనదగ్గరగా ఇంకా దగ్గరగా తెచ్చుకోవాలనీ ఉంది.కాని...

బలవంతంగా చదువుతున్నాడు.

ఆలోచనల్ని ఆపుకుని.

ఎంత సేపో.

పది దాటింది. రేఖ రాలేదు. రెండు నిమిషాలు ఆలోచించి లేచి బయటికి వెళ్ళేడు

రేఖ కిచెన్ పక్కన అరుగుమీద కూర్చుంది.

ఆమె వొడిలో టైగర్.

వాడి బుగ్గలు నిమురుతోంది.

సడి అయింది కాబోలు. వెనుదిరిగి చూసింది...గోపాల్‌ని చూసి తానూ పిల్లవాణ్ని లేవదీసి లేచింది.

ఆమె కళ్ళలో కారుణ్యం.

ముఖంలో ఓర్పు.

"గట్టిగా తగిలిందా?" అన్నాడు గోపాల్-మరేమీ అనేదిలేక.

చిన్నగా తల ఊపింది రేఖ.

"రక్తం వొచ్చిందా?"

"కొంచెం...మీ ఉంగరం గీసుకుంది కాబోలు."

"సారీ...ఒక్కక్షణం ఒళ్ళు తెలియలేదు...వాడు...పాపం!"

రేఖ అర్థమైనట్టు తల ఊపి చేతులు కడుక్కుని తుడుచుకుంటూ అతని వేపు తిరిగి, "వాడివేళ ఇక్కడే పడుకుంటే బాగుంటుంది" అంది.

"అవును" అన్నాడు కొంత రిలీఫ్‌తో గోపాల్. ఆమె కొంతయినా తనని క్షమించినట్టు అది సూచనగా తీసుకున్నాడు.

టైగర్ ముఖం ఎర్రగా కంది ఉంది. కాని, పరికించి చూసినా వాడి కళ్లలో ద్వేషం కనిపించలేదు గోపాల్‌కి. బయట అయితేనే పడుకుంటానన్నాడు వాడు. లోపల నిద్రపట్టదట. కేంప్ కాట్, దుప్పటి ఇచ్చి తలుపులు వేసి బెడ్ రూమ్‌లోకి వొచ్చి పడుకుంది రేఖ.

"నిన్ను చాలా బాధపెట్టేను."

రేఖ ఫాన్‌ని పట్టి పట్టి చూస్తూ ఉండిపోయింది.

"సారీ..."

రేఖ పక్కకి తిరిగి కళ్ళు మూసుకుంది.

ఆమె మనసు నిండా ఆలోచనలు తుఫానుల్లాగ సాగుతున్నాయి. కానీ ఏదీ బయటపెట్టేది కాదు.

ఈ రోజు...

టైగర్‌ని గట్టిగా కొట్టేడు గోపాల్.

వాడి బుగ్గమీద రక్తం వొచ్చింది...తన మనస్సు చివుక్కుమన్నది. ముందర ఆ మనిషిమీద చాలా కోపం వొచ్చింది.

కాని...తన కున్నంత అభిమానం లేకపోయినా గోపాల్‌కీ వాడంటే చాలా ఇష్టం. చిన్న చిన్న పువ్వుల పెద్ద దండ అల్లినట్టు ఆ సంఘటన వెనక ఉన్న చిన్న చిన్న విషయాలన్నిటినీ చేర్చి అతని హృదయంలో ఆ క్షణాలలో వొచ్చిన ఆలోచనా శకలాలకి తన కళ్ళల్లోనించే ఒకరూపు ఇవ్వగలిగింది రేఖ. మనసారా టైగర్‌కి పరిచర్యలు చేసినా, ఆమెకి, చిత్రంగా, గోపాల్ మీద కోపం రాలేదు. ఆ మాట అతనికి చెప్పాలని మాత్రం అనిపించలేదు.

నిద్ర వొస్తే బాగుండును...గోపాల్ దీపం తీసేస్తే బాగుండును.

ఆమె లోలోపలి మాటలు వినిపించినట్టు, గోపాల్ దీపం తీసేశాడు. అనుకోకుండా అతనికి ఆమెని ఒక్కసారి తాకాలి అనిపించింది—ఎలాగో. ఆస్పర్శ, ఈ రోజు తామిద్దరి మధ్యా వొచ్చిన చాలా దూరాన్ని కొంత తగ్గిస్తుందని అతని అస్పష్టమైన ఆశ.

తాలనగా అతని చెయ్యి ఆమె చెంప నిమిరింది.

రేఖ చలించలేదు...ఆ స్పర్శ ఆమెకి కొంత ఉపశమనం ఇచ్చింది. కాని, ఆమె చలించవలసినంతగా కాదు.

అతను అటు తిరిగి నిద్రకి ఉపక్రమించాడు. ఒకసారి కళ్ళు మూసుకుంటే త్వరగానే అతను గాఢమైన నిద్రలోకి జారుకుంటాడని ఆమెకి తెలుసును. రేఖ మనసులోనే అతనికి ధన్యవాదాలు చెప్పుకుంది. ఎప్పుడు తన జోలికి రాకూడదో అతనికి బాగా తెలుసును.

రేఖ కూడా నిద్రపోడానికి ప్రయత్నించింది.

అంత సుఖవుగా నిద్రరాదు.

పదిగంటలలాగ అనిపించిన పదినిమిషాల తరవాత ఆమె చాలా నెమ్మదిగా లేచి కిటికీ దగ్గర కుర్చీలో కూర్చుంది.

బయట వెన్నెల నిండుగా కాస్తోంది. నేడో రేపో పౌర్ణిమ అయి ఉండాలి...

గార్డెన్‌లో మొక్కలన్నీ అందంగా నిద్రపోతున్నాయి. వేసవికాలపు వెన్నెల రాత్రిలో ఊరంతా మాటు మణిగి విశ్రాంతి తీసుకొంటోంది. దూరంగా కార్లు అప్పుడప్పుడూ రొద చేస్తున్నాయి.

ఉండీ ఉండీ నైట్‌క్వీన్ పరిమళం ఆహ్లాదకరంగా గదిలోకి వొస్తోంది. కాని ఆమెకి అవన్నీ ఆట్టేసేపు ఆనందం ఇవ్వలేదు.

వెనుదిరిగి మంచంమీద చూసింది.

గోపాల్ నిశ్చలంగా నిద్రపోతున్నాడు. పాపం! అతని మనసు కూడా తనదిలాగానే, గాయపడి ఉంటుంది. కాని దైవానిక్కూడా మంచివాళ్ళ మీద అభిమానం ఉంటుంది. అందుకే అతనలాగ నిద్రపోగలుగుతున్నాడు

తన గాయం వేరు. అతని చిన్న చిన్న గాయాలకన్నా ఎక్కువ లోతైనది సంవత్సరాలనించి ఉంది...ఇంకా ఉంటుంది. ఎప్పటిదాకానో!

ఈ రోజు అవన్నీ జ్ఞాపకం చేసుకోవాలనిలేదు. ఈ సుడిగాలిలోనించి తనకి ముక్తి ఉందా లేదా అని మరొకసారి ఆలోచించాలనిలేదు.

కాని, బయట వెన్నెల కాస్తోంది.

నైట్‌క్వీన్ పరిమళాలు ఏవేవో జ్ఞాపకాలు తెస్తున్నాయి.

వాటిని ఆపే శక్తి ఆమెలో లేదు.

ఆ రోజు వెన్నెల నిండు పౌర్ణిమ వెన్నెల. సువాసన నైట్‌క్వీన్ ఒక్కటే కాదు...దానితో గులాబులు కూడా ఉన్నాయి.

ఎందుకో ఆ రోజు మనసంతా కలవరంగా ఉంది.

"ఏమిటయింది నీ కివేళ?" అంది మాలతి రెండు మూడుసార్లు-ఏమీ లేదంటే ఎందుకో నవ్వి నవ్వి చూసింది మాలతి. తన రూమ్మేట్. తన కంపెనీలోనే ఆమెకీ ఉద్యోగం. తానూ ఆమే కలిసి ఆ చిన్న, రెండు గదుల ఇంట్లో ఉండేవారు.

పట్నానికి ఉద్యోగం చెయ్యడంకోసం రాగానే, పెద్ద దిగులు...అసలు రాగలనా అనే. తనకి ఎంతో భయం.

మరి ప్రకాశం మామ పట్టు పట్టి కూర్చున్నాడు—తాను ఎక్కడా ఉద్యోగం చెయ్యడానికి వీల్లేదని.

మీకన్నా అబ్బాయే నయం అంటే
ఒప్పుకుంటారా!!

అప్పటికి అమ్మ చచ్చిపోయి ఆరునెలలయింది...చచ్చిపోతూ తనని ప్రకాశం మామయ్యకి ఒప్పగించి వెళ్ళింది. "దీని మాట నువ్వే చూసుకోవాలిరా...నీ కూతురితో దీన్ని ఒక ఇంటిదాన్ని చెయ్యరా" అంది, తాలినాడు.

ఆమెకి వేరే దారిలేదు.

ఉన్న ఆస్తి ప్రకాశం చేతిలోనే ఉంది. నాన్న పోయాక వొచ్చే చిన్న పెన్సన్‌కి భూమి మీద వొచ్చే గింజలూ, కొంత డబ్బు జమచేసి తన బి. ఏ. దాకా చదువు సాగించింది అమ్మ. భూముల గొడవలు ఆమెకి తెలీవు. ఏ గొడవలూ ఆమెకి తెలీవు, నిజానికి. అలా అని అమాయకురాలూ కాదు; ఆమె అంటే చాలా మందికి భయం ఉండేది. చాలా కచ్చితమైన మనిషి...ఉన్నది నిష్కర్షగా అనేయడమేగాని, వేరే ఆలోచనలేదు ఆమెకి.

"అలాగే అక్కా! నువ్వు చెప్పాలా?" అన్నాడు సానునయంగా, ప్రకాశం మామయ్య.

"చెప్పాలిరా! నీ గుణాలు నీకు ఉన్నాయి...కాని, నువ్వొక్కడివే నాకు దిక్కయ్యావు" అంది అమ్మ.

అప్పటికి దాని అర్థం తనకి తెలియలేదు.

నెలలోపుచే తెలిసింది.

తన సొంత చెల్లెలి కూతురి మీదే మామయ్యకి కన్ను పడింది-చదువు కున్నది; తల్లి లేనిది అని గౌరవమూలేదు; మమతాలేదు.

అతని పెద్ద ఇంట్లో తన ఉనికి ఇరవైనాలుగ్గంటలూ రక్షణా మార్గాలు వెదకడంతోనే సరిపోయింది. ఇంటి దొంగ...ఆ పైన అతనూ చండశాసనుడు. లోకువగా ఉన్న తన జీవితం.

ఇంట్లో ఊరికే కూర్చోవడమే కష్టం. దానికి తోడు అమ్మమీద బెంగ. వీటన్నిటితోనూ మామయ్య...పులిలాగ కాచి కూర్చుని....

ఎలాగైనా వెళ్ళిపోవాలని అనిపించింది.

అక్కడే ఉంటే ఆత్మహత్య చేసుకోవడం తప్ప శరణ్యంలేదు.

"ఎమ్మే చదువుతాను మామయ్యా" అంది చివరికి ఒకనాడు-అత్తయ్యా, పిల్లలూ అందరూ కూర్చుని ఉండగా.

"నీ కింక చదువెందుకు రేఖా!...మనలో పెద్ద చదువులు అంతగా అలవాటు లేదు...బి. ఏ. అయావుగా! చాల్లే" అన్నాడు మామయ్య.

"కాదు-నాకు ఎమ్మే చదువుకోవాలని ఉంది" అంది రేఖ. కొంచెం కోపంగా అంది

"కోరికలుంటాయి...తీరే విధానం ఉండొద్దూ?" అన్నాడు ప్రకాశం మామయ్య తనని వికృతంగా చూస్తూ.

"అంటే ?" అంది.

అత్తయ్య పిల్లలకి వెళ్ళిపొమ్మని సంజ్ఞ చెయ్యడం చూసింది. వాళ్ళు వెళ్ళిపోయేదాకా మామయ్య మాట్లాడలేదు.

వెళ్ళిపోయాక, "రేఖా! ఏమి పెద్దచదువులు చదివినా, లోకజ్ఞానం లేని మనిషివి నువ్వు" అన్నాడు.

అత్తయ్య తల ఎత్తకుండా పత్తిలోనించి గింజలు తీసి వొత్తులు తయారు చేస్తోంది, దైవం ముందు దీపాలకి.

"ఏమిటి మామయ్యా ?" అంది.

"మీ అమ్మ నా అక్క గనక దానికి కావలసింది నా చేతనైనంతవరకూ సర్దుబాటు చేస్తూ వొచ్చాను...నా డబ్బు అంటే ముట్టదు కనక తనదేనని మభ్య పెడుతూ వొచ్చాను. గాని, మీ నాన్న చేసిన అప్పులు తీరడానికే చాల్లేదు మీ భూములు...మీ అమ్మ నీకు చెప్పడం మరిచిపోయిందేమో...ఏడేళ్ళ కిందటే వాటిని తనఖాలో పెట్టేం-మీ నాన్నకి డబ్బు ఖర్చు ఎక్కువ మరి" అన్నాడు.

"నిజంగా ?" అంది ఆదేమిటో ఏమీ బోధపడక.

"నీ దగ్గర ఆబద్ధం చెప్తానా ?..." అన్నాడు మామయ్య. ఏడెనిమిది ఎకరాల భూమి ఒక్కమాటతో మాయం చేస్తూ.

"అయితే...నా పేరన..."

"మీ పాత ఇల్లు తప్పితే ఏమీలేదు రేఖా !...అయినా, నువ్వు విచారపడకు. నేనుండగా నీకేలోటూ రానివ్వను-మీ అమ్మకి మాట ఇచ్చేను. అదీకాక నువ్వేం పరాయిదానివి కాదు" అన్నాడు.

తెల్లబోయి చూసింది.

"ఒకటోరకమైన సంబంధం చూస్తున్నాను...మొన్న నాటకం మెచ్చుకున్నావే అందులో హీరో !...ప్రయత్నం కుదిరితే వచ్చే మాఘంలో పెళ్ళి" అన్నాడు మామయ్య.

ఆ 'హీరో' తెలుసును.

వాణ్ని గురించి ఆరుణ...ప్రకాశం మామయ్య పెద్దమ్మాయి చెప్పింది. ఉండాల్సిన గుణాలన్నీ ఉన్నాయి...నిరక్షర కుక్షి.

"చదువు లేకపోతేనేం ?...లక్షల్లో ఉంది ఆస్తి...అదీకాక నా చెప్పు చేతల్లో ఉంటాడు. చాలా బుద్ధిమంతుడు...మనిషిని చూడనే చూశావుగా !...నువ్వే బెంగ పెట్టుకోకు రేఖా ! అన్నీ నేను చూసుకుంటానుగా !" అన్నాడు.

తన మెడ చుట్టూ పన్నిన ఉచ్చులు ఒకటీ ఒకటీ తెలిసి వొస్తున్నాయి రేఖకి.

ఎంత అజ్ఞానంలో పెరిగినా, ప్రకాశం మాటలకి అర్థం తెలియకపోనంత మూర్ఖత్వం ఆమెలో లేదు.

"నా కింకా పెళ్ళి వొద్దులే..." అంది, మాట బయటికి తెచ్చి.

"మరి ?"

"ఏదో ఉద్యోగం చేస్తాను."

"నేను బ్రతికి ఉండగానా ? అక్క చచ్చిపోయింది; దీనికి పట్టెడన్నం పెట్టలేదని నా పరువు తీసెయ్యరూ, ఊరివాళ్ళు ?" అన్నాడు ప్రకాశం.

"మామయ్యగారి నలాగ బాధపెట్టకమ్మా ! నువ్వు నాకు బరువా, ఆయనకి బరువా ?" అంది అత్తయ్య మెడలో కాసులపేరు సర్దుకుంటూ.

తన కిఁక అక్కడ నుంచి భవిష్యత్తేమీలేదని తెలిసి వొచ్చింది-అంతకు ముందు అనుమానం ఉందని కాదు-ఇంక నిశ్చయం అయిపోయింది.

ఇక్కడ వొదిలి వెళ్ళిపోవాలి.

ఎలాగ ?

ఆ ఊరిలో తానెరిగినది ఒక్కరే...సుబ్బరామయ్యగారు. ఆయన నాన్నకి చిన్నప్పటినించీ స్నేహితులు...మామయ్య ఊరిలోలేని రోజున వాళ్లమ్మాయిని చూసే మిషమీద అక్కడికి వెళ్ళింది.

ఏమీ దాచకుండా ఆయనకంతా చెప్పింది.

చివరికి ఆపుకోలేని దుఃఖం వొచ్చేసింది.

ఆయన ఓదార్చాడు. ప్రకాశం అంటే ఆయనకి కొంత భయం ఉన్నా,ఆమె అక్కడినించి వెళ్ళిపోడానికి ఏర్పాట్లన్నీ చేశాడు. తన మేనకోడలు మద్రాసులో ఉంది. ఆమె దగ్గరకి వెళ్ళమన్నాడు. ఆ అడ్రసూ, ఆయన ఇచ్చిన కొంత డబ్బు తీసుకుని ఒక సాయంత్రం రేఖ ఇల్లు వొదిలి వెళ్ళిపోయింది. వెళ్ళిన మూడో రోజుకి ఒక ఉత్తరం హైదరాబాదునించి పోస్టు చేయించి పెట్టేరు సుబ్బరామయ్యగారు...తన కోసం వెతకడం వృధా అనీ, ప్రకాశం చేస్తోన్నదీ చెయ్యదలుచుకున్నదీ అమానుషంగా ఉంది కనక తాను ఇల్లు వొదిలి వెళ్ళి పోతున్నాననీ ఉత్తరం సారాంశం. సుబ్బరామయ్య స్వయంగా ఆ ఉత్తరం హైదరాబాద్‌లో పోస్ట్ చేస్తానన్నారు. తరవాత వార్తా పత్రికలలో కూడా తన 'తప్పి పోవడం' గురించి మామయ్య ప్రకటనలు వేశాడుట. ఆయనే రాశారు.

తిన్నగా మాలతి ఇంటికి వొచ్చేసింది రేఖ.

కౌగలించుకుని మరీ స్వాగతం ఇచ్చింది మాలతి. అప్పటికి మాంబళంలో ఒక చిన్న ఇంట్లో అవుట్ హవుస్‌లో ఉండేది. రేఖ మద్రాసు ఇంతకు ముందు వొచ్చి ఉండడాన్న ఇల్లు కొంతలో కొంత సుళువుగానే దొరికింది

మూడో రోజునించి ఉద్యోగ ప్రయత్నాలు సాగించింది రేఖ-మాలతి ఎంతగా తనని ప్రేమించినా, ఆమె మీద ఆధారపడి ఉండడం ఆమెకి ఏమీ ఇష్టంలేదు.

డిగ్రీ ఉన్నంత మాత్రాన ఉద్యోగం దొరకదని ఆమెకి త్వరగానే తెలిసి వొచ్చింది. ఎక్కడికి వెళ్ళినా ఒకటే జవాబు...కొందరు మర్యాదగానూ, కొందరు అమర్యాదగాను చెప్పేరు-ఖాళీలేదు అంతే.

జీవన్ ట్రేడింగ్ కంపెనీకీ అలాగే వెళ్ళింది.

వాళ్ళానాడే అడ్వర్టయిజ్ చేశారని ఆమెకి తెలీదు.

అది చూసి వొచ్చిందని వాళ్ళనుకున్నారు

అనాడే జీవన్‌ని చూడడం-

తన గురించిన ప్రశ్నలన్నీ అడిగి అనుకోకుండానే తన జీవిత చరిత్ర అంతా

తెలుసుకున్నాడు జీవన్. "న్యాయంగా మీకు క్వాలిఫికేషన్‌లేదని పంపెయ్యాలి... కాని, ఎందుకో మనసొప్పడంలేదు" అన్నాడు.

మాట్లాడకుండా అలాగే కూర్చుంది.

"పని-చాలా ఉండదు. ప్రస్తుతం మూడు వందల కన్న ఇవ్వలేము..." అన్నాడు జీవన్.

"సరే" నంది రేఖ.

"రేపొచ్చి చేరండి-మా మేనేజరు ఆర్డరిస్తాడు" అన్నాడు జీవన్

నమస్కారంచేసి బయటపడింది రేఖ. ఆ నాటితో తన ఆత్మగౌరవం మళ్ళీ దొరికింది...తన కాళ్ళ మీద తాను నిలబడగలదు!

రెండు మూడు మాసాలు ఉద్యోగం చేసేసరికి కొత్త జీవితానికి అలవాటు పడిపోయింది రేఖ. జీవితంలో మాలతి తప్ప ఇంకెవరూ లేరు తనకి...ఆమె ఆదరాభిమానాలు, తేలిగ్గా ఆఫీసు పనీ ఆమెకి కొత్త జీవితంలో కొంత సుఖ శాంతులను ఇచ్చేయి.

ఆ పరిస్థితుల్లో ఒక ఆదివారం సాయంత్రం దిగాలుగా కూర్చుంది తాను. ఏమిటో తనకే తెలీని కొత్త అసంతృప్తి, మనసులో.

"ఏమిటయింది నీ కీవేళ ?" అంటూ నవ్వుతుంది మాలతి.

ఏమీలేదు. ఏమీలేదు మాటల్లో పెట్టలేని అసంతృప్తిని ఏమని, ఎలాగ చెప్తుంది ?

"సినిమాకి పోదామా ?" అంది, మాలతి.

"నా కోసం అరుణ్ వొస్తున్నాడు...మువ్వెళ్ళు" అంది మాలతి. అరుణ్ ఆమెకి బంధువూ, స్నేహితుడూను. బేంక్‌లో మాలతితో ఉద్యోగం చేస్తున్నాడు. వాళ్ళిద్దరికీ పెళ్ళి కావడానికి ఎంతో వ్యవధి ఉందేలాగలేదు. ఆ తరవాత తన మాట ఏమిటని రేఖకి అప్పుడప్పుడు బెంగగా ఉంటుంది.

"నేనొక్కతెనీనా ?" అని అనబోయి ఆగిపోయింది. క్రిందటిసారి అరుణ్ వొచ్చినప్పుడు మూడో మనిషిగా రేఖ చాలా ఇబ్బందిపడింది-సాయంత్రం వాళ్ళిద్దరూ పార్కుకి వెళ్ళినప్పుడు తానే వెళ్ళి ఉండాల్సింది అనుకుని విచారించింది.

"గుడ్..."అని, పిక్చరూ, థియేటరూ పేపర్లో చూసి నిర్ణయించుకుని బయలుదేరింది రేఖ. హిందీ పిక్చరైతే టికెట్ దొరకొచ్చునని ఒక హిందీ పిక్చరు సెలెక్టు చేసుకుంది.

ఆరున్నరకి పిక్చరు.

ఎంతకీ రానిబస్సులూ, వొచ్చీరాని భాషలో తెలియని దారి అడిగే[శమా- అన్నీ కలిసి ఆమె థియేటర్‌కి చేసేసరికి ఏడవబోతోంది. బుకింగ్ క్లోజ్... హౌస్‌ఫుల్ బోర్డులు చూసి, ఒక్కసారి నీరసపడి అక్కడున్న బల్లమీద కూర్చుంది రేఖ.

ఎక్కడికి వెళ్ళడం ?

రాత్రి తొమ్మిదిన్నరలోపున ఇంటికి వెడితే బాగుండదు...

ఇవేళ సినిమాకి వెళ్ళాలనీ ఉంది...

ఎండలో వొచ్చిందేమో, అలిసి కళ్ళు మూసుకుంది రేఖ-మళ్ళీ తెరవాలని లేదు. అంత అలసట.

"హల్లో, మిస్ రేఖా !"

ఎక్కడో విన్న గొంతుక. కళ్ళు తెరిచి చూసేసరికి, జీవన్.

లేచి నిలబడి నమస్కరించింది. రోజూ నాలుగైదుసార్లు కాగితాలతో అతని దగ్గరకి వెళ్ళినా, అతను మిస్ రేఖా అనే పిలుస్తాడు.

"సినిమాకి వొచ్చారా ?" అన్నాడు జీవన్.

"అవునండీ" అంది రేఖ, వివరాలు చెప్పడం ఇష్టంలేక.

"మరి? ఇక్కడే ఉన్నారేం?"

"—టికెట్ దొరకలేదు."

"ఒక్కరే వొచ్చారా?"

"అవును..."

వాచీ చూసుకున్నాడు జీవన్.

"రండి నా దగ్గర టికెట్స్ ఉన్నాయి."

"మరి...మీ ఫ్రెండు..."

"ఫ్రెండు కాదు. నా భార్య వొస్తానంది. ఇంక రాదన్నమాట - ఆవిడకి అలవాటేలెండి...రండి."

వెళ్ళి కూర్చున్నారు. పిక్చరప్పుడే ప్రారంభిస్తున్నారు. లోపల చల్లగా ఉంది. ప్రాణం లేచి వొస్తోంది.

"హిందీ తెలుసునా?"

"కొంచెం...కొంచెం."

"తెలియనిచోట అడగండి."

అతి మర్యాదగా చెప్పేడు. పొరపాటున కూడా అతను రేఖకి తగలకుండా కూర్చుని సినిమా చూశాడు.

ఆదిమానవులు




ఇంటర్వెల్‌లో బయటికి తీసికెళ్ళి కూల్‌డ్రింక్, చాక్‌లెట్స్ కొని ఇచ్చాడు. ఆమె మనసారా వద్దంటున్నా, ఒప్పుకోలేదు.

సినిమా ముగిశాక "మీ ఇల్లెక్కడ?" అన్నాడు.

చెప్పింది.

"పదండి-డ్రాప్ చేస్తాను" అన్నాడు జీవన్-కారు తలుపు తీస్తూ.

"వద్దండీ. బస్‌లో వెళ్ళిపోతాను" అంది రేఖ.

"ఫరవాలేదు-టి నగర్ ఏ మాత్రం దూరం?...రండి, దయచేసి" అన్నాడు. రేఖ ఇంక వాదనమాని కూర్చుంది.

"మీరు...ఒంటరిగా ఉంటున్నారా?" అన్నాడు జీవన్ దారిలో.

"లేదు-మరో అమ్మాయితో..."

"అలాగా!-సౌకర్యంగా ఉందా?"

"ఉంది."

ఆమె వొద్దంటున్నా, మెయిన్ రోడ్డు వొదిలి రేఖ ఇంటిదాకా వెళ్ళి మరీ వొదిలి వెళ్లేడు.

అరుణ్ అప్పుడే వెళ్ళడానికి సిద్ధమౌతున్నాడు.

అతను వెళ్లగానే, మాలతి రేఖ దగ్గరికొచ్చి, "సినిమా ఎలాగ ఉంది?" అంది.

"బాగానే ఉంది "

మళ్ళీ నవ్వుతోంది మాలతి.

"చాలా బాగున్నట్టుంది" అంది.

"ఏం ?"

"ఈ మూడు నెలల్లో ముఖం ఇంత ఆనందంగా ఎప్పుడూ వెలగలేదు ... అందుకు" అంది.

"నిజంగా?" అంది రేఖ. ఈ సాయంత్రం తానెందుకో చాలా ఉల్లాసంగా ఉన్న సంగతి ఆమె నిజంగానే గమనించలేదు.

"నిజం!" అంది మాలతి.

రాత్రి నిద్రపోయే ముందు రేఖ ఆలోచనల నిండా జీవన్ ... ఏదో తెలీని సంతోషం.

మర్నాడుగాని, మరెప్పుడుగాని, జీవన్ నిన్న జరిగినది తెలిసినట్టే ప్రవర్తించలేదు.

ఆ నెలాఖరుకి ఆమె ప్రొబేషన్ ముగిసింది.

ఐదు వొందల రూపాయిలయింది జీతం.

"థాంక్స్" అంది ఆర్డరు చూసి.

"యూ డిజర్వ్ ఇట్" అన్నాడు జీవన్.

అప్పటి కతనంటే గౌరవం, కొంత అభిమానంకన్న ఏ భావాలూ లేవు-కాని, అతన్ని గురించి తరుచూ ఆలోచించేది. ఇలాగే వెన్నెలలోకి చూస్తూ, గులాబుల వాసనా, నైట్‌క్వీన్ వాసనా కలిసిన గాలి పీల్చేటప్పుడు వేడివేడి అసంతృప్తి మధ్యన అతను జ్ఞాపకం వొచ్చేవాడు. మరి, ఆ సినిమాకి వెళ్ళిన ఆదివారం ఆ వాసనల చెలిమితోనే నిద్రపోయింది.

"ఇంకా నిద్రపోలేదా, రేఖా?"

గోపాల్ ఎప్పుడు లేచాడో తెలీదు.

కష్టంగా ప్రస్తుతానికి వొచ్చి, "నిద్ర రాలేదు" అంది.

"రా...ఇంక నిద్రపో ... అలిసిపోయావు" అన్నాడు గోపాల్. ఆమెని లేవదీసి మంచం దగ్గరికి తీసికెళ్ళాడు.

రాత్రి బాగా చల్లబడింది.

భుజాలదాకా దుప్పటి కప్పి, అతను మళ్లాని నిద్రపోయాడు. కొంతసేపటి తరువాత రేఖ కూడా నిద్రపోయింది.

## 3

మర్నాడు ఆదివారం.

ఆ ఇంట్లో ఆదివారం ఒక పద్ధతి, మిగిలిన రోజులన్నీ మరొక పద్ధతిని.

ఉదయం అలారమ్ కొట్టదు ఏ గడియారమూను.

అంతా తీరుబాటుగా ఉంటుంది.

రేఖ నిద్రలేచేసరికి తొమ్మిదయింది. డైనింగ్‌రూమ్‌లోకి వచ్చి టీ చేసుకుని తాగింది.

గోపాల్ ఇంట్లో కనిపించలేదు.

అటూ ఇటూ చూస్తే గార్డెన్‌లో పనిచేస్తూ కనిపించాడు. డ్రైగర్ అతనికి సహాయం చేస్తున్నాడు.

ఇద్దరూ నవ్వుతున్నారెందుకో.

రేఖ మనస్సులోంచి ఒక బరువు తీసేసినట్లైంది.

టీ తాగి లేచింది. ఇల్లంతా కొత్తగా ఉంది.

ఫర్నిచర్ అంతా అటూ ఇటూ మార్చి ఉంది. కర్టెన్లు కొత్తవి, శుభ్రంగా ఉన్నాయి. ప్రతి గదిలోనూ ఫ్లవర్‌వాజ్‌లో పువ్వులు, కళకళలాడుతూ.

ఇదంతా చెయ్యడం డ్రైగర్‌కి చేతకాదు.

గోపాల్ చేశాడు.

ఇల్లు ఎంత అందంగా ఉంటే రేఖకి అంత సంతోషం. కాని, తరచు ఆమె ఇవన్నీ చేసుకోలేకపోతుంది.

గోపాల్ ఫేక్టరీనుంచి వొచ్చేసరికి అలిసిపోయి ఉంటాడు-అంచేత ఆమెకి కావలసినంత నీట్‌గా ఉండదు ఇల్లు. ఇవేళ ఎంతో బాగుంది

డ్రెస్సింగ్ టేబిల్‌మీద నిన్న చిందరవందరగా పడిఉన్న సామాగ్రులన్నీ శుభ్రంగా అమర్చి ఉన్నాయి.

అద్దంమీద చిన్న కార్డు "ఐ లౌ యు" అంతే.

అది గోపాల్ దస్తూరీలో ఉంది.

రెండు నిమిషాలు అలాగే చూస్తూ ఉండిపోయింది రేఖ. ఇంతగా గోపాల్ ఎప్పుడూ తన భావన వ్యక్తం చెయ్యలేదు. అతనికి తనమీద ఎంతో ఆప్యాయత ఉందని ఆమెకి తెలుసు...కాని...

స్నానంచేసి శుభ్రమైన బట్టలు వేసుకున్నాక పునర్జన్మలాగ ఉంది రేఖకి. నిన్నంతా జరగనట్టే ఉంది.

గోపాల్ తనని క్షమించినట్టే ఉంది.

కిటికీలోనించి బయటకి చూసింది. వాళ్ళిద్దరూ ఏదో చర్చిస్తున్నారు. టైగర్ గోపాల్ని క్షమించినట్టే ఉంది.

కిటికీ దగ్గర కుర్చీ వేసి ఉంది.

కూర్చుంటే గార్డెన్ కనిపిస్తోంది.

బయట ఎండగా ఉంది. గదిలో ఫేన్ కింద చల్లగా ఉంది. మనస్సు మట్టుకు వేడి ఎక్కుతోంది.

హటాత్తుగా గోపాల్ తనవైపు చూసి చెయ్యి ఊపేడు.

చిరునవ్వుతో, అనుకోకుండానే ఆమెకూడా చెయ్యి ఊపింది- చేతిలో ఉన్నవి అక్కడ పడేసి, గోపాల్ కిటికీ దగ్గరికి వొచ్చాడు-అతని ముఖం నిండా చెమట, మన్ను.

"లంచ్‌కి పోదాం...వంట చెయ్యకు" అన్నాడు.

ఆలాగేనని, "ఎండగా ఉంది; లోపలికి రండి" అంది.

"వొస్తాను...ఇంకొక్క మొక్క పాతేసి. పొద్దున్న వెళ్ళి పది మొక్కలు-వాలావరకు క్రోటన్స్ కొనుక్కుని వొచ్చేను" అన్నాడు గోపాల్. చిన్నపిల్ల వాడు తాను చేసిన ఘనకార్యం తల్లితో చెప్తోన్నట్టు.

"త్వరగా వొచ్చేయండి" అంది రేఖ.

"పది నిమిషాలు" అన్నాడు గోపాల్.

రేఖ గోపాల్ని చూస్తూనే మరోసారి 'పది నిమిషాలు' అనుకుంది.

ఎంతో కాలంకిందటలాగ ఉంది; కాని రెండు సంవత్సరాలు కూడా పూర్తి కాలేదు.

"పది నిమిషాలు...నన్నిక్కడ కూర్చోనివ్వండి" అంటూ ఒకనాడు చీకటిపడ్డాక వొచ్చాడు జీవన్, మాలతి వాళ్ళ చుట్టాల ఇంటికి వెళ్ళింది. ఆమె కోసం ఎదురుచూస్తోన్న రేఖ హటాత్తుగా జీవన్ గదిలోకి రావడం చూసి ఆశ్చర్యపడింది.

"కూర్చోండి..." అంది తాను లేచి నిలబడుతూ.

"మీరు కూర్చోండి...ఒక గ్లాసు మంచినీరు తప్ప మరేమీ అక్కరలేదు నాకు..." అన్నాడు జీవన్.

మంచినీరు తెచ్చి యిచ్చింది. అలా హటాత్తుగా జీవన్ ఎందుకు వచ్చాడో అర్థంకాలేదు. సినిమానుంచి ఇంటికి తీసుకొచ్చి వొదిలిన ఆ రోజు తరవాత మళ్ళీ ఆఫీసు బయట ఇదే కలియడం.

"దయచేసి కూర్చోండి" అన్నాడు జీవన్. ఆమె కూర్చున్నాక, "పది నిమిషాలు మీతో మాటలాడి వెళ్ళిపోతాను. మీకేం ఇబ్బంది ఉండదుకదా!" అన్నాడు.

ఉండదని తలఊపి సూచించింది.

"థేంక్స్. మీరు నా కంపెనీలో పనిచేస్తూండడంవల్ల మీ మీద కూడని అధికారం చెలాయించడంలేదు నేను...ఎందుకో, మీ దగ్గర కూర్చుంటే నాకు శాంతిగా ఉంటుంది. అందుకే, మానసికంగా ఈ రోజు మరీ బాధగా ఉండి, ఇక్కడికి వొచ్చాను" అన్నాడు పడక కుర్చీలో వెనక్కి జారబడి కళ్ళు మూసుకుని, జీవన్.

ఆ రోజు అతన్ని నాలుగైదుసార్లు ఆఫీసులో చూసింది రేఖ – ఎందుకో అతను రోజూలాగ లేడని అనుకుంది. పని ముమ్మరంగా ఉండటంచేత అనుకుని సరిపెట్టుకుంది.

"మీ స్నేహితురాలు ఎక్కడ?" అన్నాడు, కళ్ళుతెరిచి, జీవన్.

"చుట్టాల ఇంటికి వెళ్ళింది."

"ఒంటరిగా, చీకటిపడ్డాక, మీకు భయం వెయ్యదూ?" అన్నాడు జీవన్.

"వెయ్యదు–చుట్టూ ఇళ్ళు ఉన్నాయి కదా!" అంది రేఖ.

"మీరు సుఖంగా ఉన్నారా?" అన్నాడు జీవన్.

కొంచెం ఆశ్చర్యపడి, జవాబుకోసం వెతుక్కొని, "బాగానే ఉన్నాను..." సుఖమంటారా...ఎక్కడి కక్కడే!" అంది రేఖ ఒక్క క్షణంలో తన జీవితాన్ని విమర్శించుకుంటూ.

ఆమె ముఖంలోకి తేరిపార చూస్తూ, "నిజమే...సుఖం అంటూ ఏమీలేదు... ఇవన్నీ వొదిలి ఏ హృషీకేశమో పారిపోవాలనిపిస్తుంది నాకు తరుచు—" అన్నాడు జీవన్.

రేఖకి ఏమనాలో తెలియటంలేదు. జీవన్ అలిసి ఉన్నాడు. మానసికంగా మరీ అలిసి ఉన్నాడు.

"మీకు ఆశ్చర్యంగా ఉంది కాదూ?...నా కింత డబ్బూ...అధికారం, అటు ఇల్లూ, సంసారం...దైవమిచ్చిన ఆరోగ్యం, అన్నీ ఉండి ఈ వైరాగ్యం

నే నెవర్నీ మోసంచేసే ప్రయత్నంలాగా ఉంటుంది" అన్నాడు. అప్పు కొంటున్న బాధ రేఖ గ్రహించగలిగింది.

"మీరు మోసం చేస్తారని అనుకోను...మిమ్మల్ని తెలిసిన ఎవరూ అలాగ అనుకుంటారనుకోను." అనుకోని అభిమానం వొచ్చింది రేఖ గొంతుకలోకి.

"థేంక్స్...నేను మోసగాడిని కాను. నాకున్న కొద్దిమంది మిత్రులకే అది తెలుసును. కాని-ఆవిడ ఏమో అనుకుంటుంది. ఏం చేసేది!" అన్నాడు. ఆమె అంటే అతని భార్య అయి వుండాలి.

రేఖ ఏమీ జవాబియ్యలేదు.

జీవన్ అనకూడని మాట అనినట్టు కొంతసేపు మాట్లాడకుండా అలాగే కూర్చున్నాడు.

ఏ మగవాడూ ఆస్తికోసం భార్యని తెచ్చుకోకూడదు, మిస్ రేఖా! ఏ మనిషికీ అమ్ముడుపోవడంకన్న నీచమైన నుదుటిరాత ఉండదు. పదే పదే జ్ఞాపకంచేసి ఆమె నా జీవితం ధ్వంసం చేస్తోంది. నిజమే-నా ఆస్తులన్నీ ఆమెవే కాని ..ఆ మాట అస్తమానమూ వినడం బాధాకరంగా ఉంటుంది."

ఎందుకివన్నీ చెప్తున్నాడు, అనుకుంది రేఖ. అతనికెంతమంది స్నేహితులైనా ఉంటారు తన ఆఫీసులో చిన్న ఉద్యోగం చేసుకుంటోన్న రేఖకి అదంతా ఎందుకు చెప్పాలి?

నిజంగా, తనతో చెప్తే అతని మనోవ్యథ తగ్గితే తనకేమీ అభ్యంతరంలేదు.

"ఈ రోజు ఏం జరిగిందో చెప్పాలని లేదు ... పాపం మీరు ఇవన్నీ విని బోర్ అవుతున్నారు. నా స్వార్థాన్ని క్షమించండి ... మళ్ళీ ఏమైనా సినిమా చూశారా?"

అలాగ మరో దారిపట్టింది సంభాషణ. రేఖకి ఇది చాలా రిలీఫ్‌గా ఉంది. ఎవరి వ్యక్తిగత జీవితంలోకైనా తొంగిచూడడం సంతోషకరమైనదికాదు. అందులో సౌందర్యహీనమైన జీవితాల రహస్యాలు మరీ బాధాకరంగా ఉంటాయి.

ఆ తరవాత పది నిమిషాలు చాలాసార్లు గడిచాయి ... అతను రేఖచేతా చాలా మాట్లాడించేడు.

ఆ మాటల్లో ముఖ్యమైన విషయాలేమీ లేవు, కబుర్లు...అంతే.

కాని క్రమంగా రేఖ సంభాషణలో నిమగ్నమైపోయింది-అతడు పరిసరాలనీ, తన పరిస్థితులనీ కాలగమనాన్ని మరిచిపోయాడు. ఎన్నో సంవత్సరాలనించి




ఒకరికొకరు చెప్పదలచుకున్న మాటలు దాచుకుని దాచుకుని ఒకసారి చెప్పుకున్నట్టుంది

గడియారం చూసుకుని, "అరే! పదయిపోయింది..." అన్నాడు లేచి నిలబడుతూ జీవన్.

రేఖ కూడా ఆశ్చర్యపడింది.

"పది నిముషాలంటూ రెండు మూడు గంటలు మిమ్మల్ని కూర్చోబెట్టాను. క్షమించండి. మీతో మాట్లాడుతుంటే అన్నీ మరిచిపోయాను. తలమీద నుంచి పెద్ద బరువు తీరింది...ధన్యవాదాలు" అని, రేఖకి నమస్కారం చెప్పి త్వరత్వరగా, వెనుదిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు జీవన్.

అతను వెళ్ళిన వేపే చూస్తూ నిలబడింది రేఖ.

కారుమబ్బుల్లాంటి ముఖంతో వొచ్చి, కలకలలాడుతూ వెళ్ళిపోయాడు జీవన్. అతన్ని చూడగానే కలిగిన ఆశ్చర్యం ఆమెలో క్రమంగా నిర్వచనం తెలీని ఆప్యాయతగా మారిపోయింది.

గడిచిన గంటలు తియ్యగా ఉన్నాయి.

ఏదో తెలీని శక్తి ఆమెని ఎటో లాగుతోంది.

"ఆయన వెళ్ళిపోయాడా?" అంటూ వచ్చింది మాలతి, రేఖని ప్రస్తుత ప్రపంచంలోకి తెస్తూ.

"వెళ్లేరు" అని, "నీ కెలాగ తెలుసును?" అంది రేఖ.

"రెండు గంటల కిందట వొచ్చాను...మీ రిద్దరూ ప్రపంచంలో మరేమీ లేనట్లు మాట్లాడుకుంటున్నారు...అలా వెళ్ళి నాలుగిళ్లలో తెలిసినవాళ్ళని పలకరించి వొచ్చాను" అంది మాలతి నవ్వుతూ.

"సారీ...నువ్వు రావడం నేను గమనించలేదు" అంది రేఖ.

"అదే నేనంటూన్నదిని!" అంది మాలతి చిరునవ్వుతో.

"నవ్వేదేమీ లేదిందులో" అంది రేఖ.

"అవును, కాని చిరునవ్వులు చాలా ఉన్నాయి-పద! వంట చేసుకుందాం. మనస్సునిండా ఎంత ఉన్నా ఉదరంలోకూడా వుండాలి కదా!" అంది మాలతి.

ఆ నాడు తనలో కలిగిన తియ్యటి భావన ఈనాడు జ్ఞాపకం ఉంది.

రేఖ ముఖంనిండా ఇప్పుడు చిరునవ్వు కనిపించింది.

"ఆ చిరునవ్వుతో ఎంతో అందంగా ఉన్నావు?" అన్నాడు గోపాల్.

ప్రస్తుతానికి వొచ్చి, "ఎంతసేపైంది మీరు వొచ్చి?" అంది రేఖ.

"ఏమో! అలాగ నీవేపు చూస్తూ నిలబడ్డాను గాని, గడియారం వేపుకాదు." అన్నాడు గోపాల్.

"సారీ!" అంది రేఖ.

"దేనికి?...అంత చక్కటి చిరునవ్వు తరవాత సంతోషమే గాని విచారం ఎందుకు?...కాదూ రేఖా?" అన్నాడు గోపాల్.

ఆ చిరునవ్వు అతనికోసం వొచ్చిన సూర్యకాంతి కాదనీ, ఎవరి కాంతో తనమీద ఈ క్షణాలలో ప్రతిఫలించిన చంద్రకాంతి అనీ ఆమె ఎలాగ చెప్తుంది?

"బయటికి వెడుతున్నారా?" అంది రేఖ. మాట మార్చడానికి.

"అవును... ఒక్కసారి ఫేక్టరీకి వెళ్ళిరావాలి ... ఫోనొచ్చింది" అన్నాడు గోపాల్. రింగ్ వినిపించనేలేదు రేఖకి.

"ఆలశ్యం అవుతుందా?"

"అవదు...పది నిమిషాలు పని..." అని వెళ్ళిపోయాడు గోపాల్.

అతను వెళ్ళిపోయాక అతనికి బ్రేక్‌ఫాస్ట్ ఇవ్వలేదని జ్ఞాపకం వొచ్చి నొచ్చుకుంది రేఖ.

డైనింగ్ టేబిల్‌మీద హాట్ కేరియర్‌లో ఇడ్లీ ఉంది. చూసి, మళ్ళీ మూత

పెట్టేసింది. నిన్న అంతకోపం వొచ్చి, తనని ద్వేషించడానికి అంత కారణం ఉన్న మనిషి ఎంతగా తనకోసం ఇవేళ ఏర్పాట్లు చేస్తున్నాడు! ఆ మధ్య ఏదో మాటల సందర్భంలో, గార్డెన్‌లో ఇంకా రంగురంగుల క్రోటన్స్ ఉంటే బాగుండునని అన్నది. ఇవేళ ఇంత ఎండలోనూ గోపాల్ ఎందుకు శ్రమపడ్డాడో ఆమెకి తెలుసును. ఉదయం ఏ అయిదుకో లేచి ఉంటాడు.

"అమ్మా!" అంటూ లోపలికి వొచ్చేడు టైగర్.

"ఏం?" అంది రేఖ.

చిన్న కవరు.

చించి చూసింది.

ఆ నాటి తేదీ.

"డియర్ రేఖా!

మన జీవితంలో నిన్నటిరోజు లేదు.

మరిచిపో.

నీ విషయంలో దుర్బలమైన ఆలోచనలు రావడం నాదే దురదృష్టం.

ఎంత సిగ్గుపడుతున్నానో చెప్పలేను మాటల్లో.

క్షణికోద్రేకంలో చాలా పొరపాట్లు చేశాను...

నిన్ను ప్రేమించడం తప్పు.

నీ

గోపాల్

మళ్ళీ మళ్ళీ చదివింది.

గోపాల్! గోపాల్! అనుకుంది.

ఎంత లోతైన మనిషి!...

ఆ క్షణంలో చాలా నీరసం అనిపించింది రేఖకి.

అలాగే కుర్చీలో కూర్చుంది. గోపాల్...

మళ్ళీ ఉత్తరం చూసింది.

'నిన్న'టి రోజు లేకపోతే బాగుండును.

గోపాల్ కేమి తెలుసును? పాలవంటి మనసు అతనిది. చంటివాడి స్వభావం అతనిది.

తాను కోరుకొంటూంది నిన్నటిరోజు ఉండకపోయి ఉంటే బాగుండునని కాని, అతని కారణాలు వేరు, ఆమె కారణాలు వేరు.

ఒకప్పుడు రేపటి రోజు లేకుండే బాగుండును అన్నాడు జీవన్. తనకి అలాగే అనిపించింది. తానూ అలాగే కోరుకున్నది.

ఆ రోజు స్పష్టంగా జ్ఞాపకం ఉంది.

ఇలాగ ప్రకాశంగా, వేడిగా లేదు అప్పుడు.

ఆకాశం నిండా మేఘాలు. రోజంతా చిన్న చిన్న చినుకులూ, వర్షమూ పడుతూనే ఉన్నాయి. రోజంతా ఆఫీసులో కష్టంగానే గడిచింది. ఎందుకో, మబ్బు వేసినా, వర్షం వొచ్చినా, తన మనసు మబ్బుపట్టిపోతుంది.

ఎప్పుడూ లేనిది జీవన్, "ఏం అలాగ ఉన్నారు?" అన్నాడు, రేఖా అని పలకరించి. 'మిస్ రేఖా' వొదిలేసి నందుకు ఆమెకి చాలా సంతోషం అనిపించింది.

"ఏమీ లేదు" అంది.

సాయంత్రం ఆఫీసు వొదిలి వెళ్లేసరికి చాలా ఆలస్యం అయిపోయింది. బస్‌స్టాప్ దగ్గరికి వెళ్లేసరికి కొంత తడిసింది.

బస్‌కోసం ఎదురుచూస్తూ నిలబడింది. షెల్టరులోకికూడా చిన్న తుంపరలు వొస్తూనే ఉన్నాయి.

ఎంతకీ బస్ రాలేదు. టేక్సీలో పోతే ఏడెనిమిది రూపాయలు తక్కువకాదు. తాను భరించలేని ఖర్చు... టేక్సీలు కూడా దొరికేలా లేవు.

అలా అరగంట పైన నిలబడ్డాక జీవన్ కార్లో వొచ్చి, "కమిన్" అన్నాడు కారు తలుపుతీసి పట్టుకుని.

ఎంత రిలీఫ్‌తో కార్లో కూర్చుంది! మరో పదినిమిషాలలాగే ఎదురుచూడాల్సి ఉంటే ఆమెకి కన్నీళ్లు వొచ్చి ఉండేవి.

"చాలా అలిసిపోయారు మీరు" అన్నాడు ఆప్యాయంగా, జీవన్.

"అవును. దేవుడిలాగ వొచ్చారు" అంది రేఖ.

"మీరు వెళ్ళిన వెంటనే ఆఫీసు వదలలేకపోయాను... స్వార్థంతోనే మీరిక్కడ వెయిట్ చేస్తూ ఉండాలని ఆశించాను" అన్నాడు జీవన్ చిరునవ్వుతో. హటాత్తుగా పెద్ద వర్షం ప్రారంభమైంది.

"బస్సు దొరక్కపోవడం మంచిదైంది" అంది రేఖ.

"ఇద్దరికీని... బాగా తడిశారా?" అన్నాడు జీవన్.

"అంతగా లేదు."

"కాఫీ తాగి పోదాం."

"మీ ఇష్టం"

తాజ్‌కి తీసికెళ్లేడు. కాఫీ, దానితో రెండు మూడు రకాల టిఫిన్లు - లోపల చల్లదనానికి వొణికింది రేఖ.

"సారీ...తడిసినమీద ఇక్కడ ఏ. సీ.లో మరీ చల్లగా ఉంటుంది" అన్నాడు జీవన్. అతని ముఖంలో ఆత్రత చూసి జాలిపడింది రేఖ.

నిమిషంలో ఆమెకి బాగానే ఉంది.

చుట్టుప్రక్కల ఒక రిద్దరికన్న లేరు.

సన్నగా సంగీతం ఏ మూలనించో వినిపిస్తోంది.

వేడి వేడి కాఫీ తాగేక శరీరంలోకి కొంత వెచ్చదనం వొచ్చింది.

జీవన్‌కి దగ్గిరగా కూర్చుంటే, అతని సాహచర్యంలో మనస్సులోకి వెచ్చదనం వొచ్చింది.

అతను చిన్న గొంతుకతో ఏదో మాట్లాడుతున్నాడు.

ఉండీ, ఉండీ తానూ ఏదో చెప్తున్నది.

జ్ఞాపకం ఉంచుకోవలసిన వేవీలేవు ఆ మాటల్లో.

మరచిపోయేవి ఏవీలేవు ఆ క్షణాలలో.

తనకి జీవన్‌కి మధ్య ఏమీ తెరలు లేనట్టు ఉంది, ఆ పరిసరాలలో. అతని మాటల్లో మర్యాదా, ఆప్యాయతా కలిసి ఉన్నాయి. ఆ సాహచర్యంలో ఆమెకి ఎంతో మాధుర్యం కనిపించింది.

చివరికి, పరిమితి తెలియని ఎన్నో నిమిషాల తరవాత లేచి బయటికి వెళ్ళి కారులో కూర్చున్నారిద్దరూ. బయట వర్షం పడుతూనే ఉంది.

"పదండి...ఇంటి దగ్గర డ్రాప్ చేస్తాను" అన్నాడు జీవన్.

ఇల్లు దగ్గర అవుతోన్నకొద్దీ రేఖకి బాధగా ఉంది.

జీవన్ వెళ్ళిపోతాడు.

ఈ తియ్యటి క్షణాలు శాశ్వతంగా వెనక్కి వెళ్ళిపోతాయి...

కాని, ఏమీ అనలేని స్థితి తనది.

ఏమీ ఆపలేని స్థితి అతనిది.

ఇల్లు రానే వొచ్చింది.

"జాగ్రత్తగా వెళ్ళండి...బురదగా ఉంది..." అన్నాడు.

"ఫరవాలేదు - అలవాటే" అంది రేఖ.

"మంచి ఇల్లు ఎందుకు తీసుకోరు?" అన్నాడు.

"గడిచిపోతోంది" అంది రేఖ.

"నో. నో...మీ కే బాధలూ ఉండకూడదు" అన్నాడు జీవన్. రేఖ కారుదిగి వెళ్ళిపోతూంటే ఆమెనే గమనిస్తున్నాడు.

అప్రయత్నంగా చెయ్యి ఊపింది రేఖ.

అతని ముఖంనిండా వెన్నెల ఆమె ఆ మసక చీకట్లోకూడా చూడగలిగింది.

మాలతి ఎదురుచూస్తూ కూర్చుంది.

ఆ రాత్రి ఆమె ఎన్నో మాటలు ఆడలేదు...

నిద్రపోబోతూంటే రేఖకి జ్ఞాపకం వొచ్చింది - మొట్టమొదటిసారిగా ఒక్క-క్షణం మాత్రం జీవన్ తనని స్పర్శించాడని.

నిద్ర కొంతదూరం వెళ్ళిపోయింది. కళ్ళనిండా...జీవన్.

పెద్ద పెద్ద కెరటాలలాటి ఆలోచనల ఉద్రేకాలు.

జీవన్...జీవన్. అతనే తనకి జీవనం.

అలా అనిపించింది.

ఆ తరవాత చాలా త్వరగా అతను దగ్గర అయాడు.

వారానికి రెండు మూడు సార్లు కలిసేవారు. ఎక్కడికైనా వెళ్ళి కబుర్లు చెప్పుకునేవారు. ఊరు వొదిలి ఏ మహాబలిపురమో వెడుతూకూడా ఉండేవారు.

అతను ఆమెకోసమే బ్రతుకుతున్నట్టు ఉండేవాడు.

ఆమె అతనికోసమే బ్రతుకుతూ ఉండేది.

అంతగా దగ్గరగా, వొచ్చేశారు.

చిన్న చిన్న నీటిచుక్కలు మహాసముద్రం అయినట్టు. ఒక ఝంఝూమారుతంలో చిక్కుకున్నట్టు ఆ ఇద్దరూ పెనవేసుకున్నారు.

ఒకరి సన్నిధి ఒకరికి పెన్నిధి.

ఇంక ప్రపంచమే లేనట్టు-

ఉండేవారు. కాలానికి అర్థంలేనట్టు ఉండేవారు.

మాలతి అంతా గమనిస్తోనే ఉండేది. ఆమెకీ అరుణ్‌కీ మధ్య కొంత దూరం వొచ్చింది.

"నేను ఆశించేది వేరు-అతనికి కావల్సింది వేరు..." అంది మాలతి రేఖతో. "అందులో ఉన్న ప్రమాదాల మాట అలా ఉంచి, నా కందులో అవమానకరమైనదే చాలా కనిపిస్తోంది" అంది.

రేఖ అంగీకరించింది.




"కాని...నువ్వూ అంతకన్నా ప్రమాదమైన ఊబిలో చిక్కుకుంటున్నావు సుమా!" అంది మాలతి. ఆమెది ఈర్ష్య కాదనీ, తనకోసం నిజంగా ఆత్రత అనీ రేఖకి తెలుసును

"అతనలాటివాడు కాదు...నన్ను ఏ రకంగా నూ పాడుచెయ్యడు" అంది రేఖ. అది నిజం. వెచ్చ వెచ్చటి సన్నివేశాల మధ్య, ఎంతో అభిమానంగా ఆమె దగ్గర కొంత శారీరకమైన చనువు తీసుకున్నా, జీవన్ అంత ఉధృతమైన తమ మధ్య ఆ హద్దులు మీరిన పనులేవీ చెయ్యలేదు.

"అదంతా ఒక కళ...పొంచి పొంచి ఉండి పులి మీద పడుతుంది. ఇలాగ మనల్ని ఆదమరిపించి మగవాడు ఏదో ఒక బలహీనపు క్షణంలో మనల్ని భాగ్యహీనులుగా చేస్తాడు..." అంది మాలతి. అరుణ్ ప్రవర్తన ఆమెకి చాలా బాధ కలిగించింది. ఆశాభంగం కూడా అయింది మాలతికి.

"జీవన్ అలాటి మనిషి కాదు."

"మరీ ఆలస్యం అయేదాకా అలాటి మనిషి ఎవ్వరూ కాదు ... నీ జీతం వెయ్యి చేశాడు. ఈ ఇల్లు ఇచ్చేడు...నీ చుట్టూ తిరుగుతున్నాడు. ఏమీ కోరకుండానే?" అంది మాలతి.

రేఖకి జవాబు తెలుసును.

"అవును" అంది.

"పిచ్చి పిల్లవి! నీ కే హాని రాకూడదని నేను దైవాన్ని వేడుకుంటాను" అంది మాలతి.

"కాదు మాలతీ! జీవన్ నా దగ్గర ఉన్నంతసేపూ మర్యాదగా ప్రవర్తిస్తాడు. నా దగ్గర గడిపే క్షణాలు అతనికి ఆనందం ఇస్తాయి ... నిజం చెప్పాలంటే నాకూ అంతే...ఈ ఇల్లు అద్దెకి కాదు. నాకు ఇచ్చేశాడు - కనీసం అలాగ చెప్పేరు..."

మాలతి ఆశ్చర్యంగా చూసింది.

"అవును...కాని నేను అమ్ముడుపోయే మనిషిని కాదు — నీ కా భయం అక్కర్లేదు" అంది రేఖ.

"కాని ... అతను పెళ్ళయిన మనిషి ... నిన్ను ప్రేమించడం ఎంత స్వార్థమో, నువ్వతన్ని ప్రేమించడం అంత మూర్ఖత్వం" అంది మాలతి.

"నీ మాట నిజమే మాలతీ! కాని...అతన్ని ప్రేమించకుండా ఉండలేను. అతని భార్యకీ, పిల్లలకీ అంతకన్న ఎక్కువ అన్యాయం ఏదీ చెయ్యదలుచుకో లేదు...అంది రేఖ.

"కాని..." అంది మాలతి.

"నీ ఉద్దేశం నాకు తెలుసును! ఇలా ఎంతకాలం, అంటావు. దీనికి ముగింపు ఏమిటంటావు...అది నాకూ తెలీదు. దీనికంతకీ సుఖాంతం ఉంటుందని అనుకోను. కాని జీవన్ అంత బలవంతంగా నా సుఖం కోరుతాడు-ఆ ప్రభావం ఉంటుందని పిస్తుంది" అంది రేఖ.

"అదే నిజమవాలని ఆశిస్తాను" అంది మాలతి.

రేఖ నిశ్చయంగా అది నిజమవుతుందని నమ్మింది. ఏదో ఒకరోజున జీవన్ మాటల ఆటలు మాని చేతలదాకా వొస్తాడని మొదటిలో ఆమెకి చిన్న భయం ఉండేది కాని, అతని ప్రవర్తన అలాటి భయాన్ని త్వరగానే దూరంచేసింది. ఆ తరవాత అతనేమన్నా అంగీకరించి ఉండేది రేఖ అంత వ్యామోహం అతనంటే. కాని, "నిన్ను ప్రేమిస్తున్నది నువ్వు సుఖపడాలనిగాని, నిన్ను కొత్త బాధల్లో పెట్టాలని కాదు రేఖా!...నీ జీవితానికి ఏ విధంగానూ మచ్చ తేను" అన్నాడు ఒక పరిస్థితిలో-ఆ మాట నిలబెట్టుకుంటాడని అప్పుడు రేఖకి తెలుసును.

ఆ సన్నివేశాలన్నీ నిన్నటి తెరల చాటునించి తొంగి తొంగి చూస్తున్నాయి.

ఎన్నిసార్లు కలుసుకున్నారు? ఏమో! కాని, ప్రతిరోజూ సినిమా చూసినట్లు ఇద్దరికిద్దరూ తమ తమ దైనందిన జీవితాలను వేరువేరుగా జీవిస్తూ వాటిలోని బాధల్ని తమ సాహచర్యంలో మరిచిపోయేవారు. ఏకాంతంలో వాళ్ళది మరో ప్రపంచం. ఒక్కొక్కప్పుడు గంటలు ఎన్నో అతి కొద్దిమాటలతో గడిచి పోయేవి...కాని అవి చక్కటి నిశ్శబ్దాలు.

అలాగ గడిచిపోయింది కాలం. పెద్ద లాయర్లు ఇద్దరిని పెట్టి జీవన్ ఆమె ఆస్తి వ్యవహారాలన్నీ త్వరగానే సెటిల్ చేయించాడు. తనకంత ఆస్తి ఉందని ఆమె అనుకోలేదు. తాను ఉంటోన్న చక్కటి ఇల్లు తనపేర కొన్నాడు. అది కాక డబ్బు చాలా రకాల పెట్టుబడులు పెట్టించేడు. వొస్తున్న జీతం పేరుకే! ఆమె పరిస్థితి అంత మెరుగుపడింది.

అవన్నీ చేసి జీవన్ తనకి దగ్గరగా రాలేదు. అప్పటికే అతనిమీద ఆమెకి పూర్తిగా మమత ఉంది

మాలతికీ, తనకీ జీవన్ విషయంలో, వారి సాహచర్యం విషయంలో మాటలు జరిగాక వారిలో కొంత చనువు పెరిగిన మాట నిజమే. కాని, ఆమె అనిష్టం సూచన కాగానే జీవన్ తన హద్దుల్లోనే ఉండడానికి ప్రయత్నించాడు.

అలా జరిగింది కాలం...

దూరంగా పన్నెండు గంటల సైరన్ వినిపించి మళ్ళీ ప్రస్తుతంలోకి వొచ్చింది. "అమ్మా" అంటూ వచ్చాడు టైగర్.

"ఏం ఆకలేస్తోందా?" అంది రేఖ.

"అవును..."

"పోయి హోటల్లో తినిరా...మేమూ బయటికి వెళుతున్నాము" అంది రేఖ. వాడిమాట మరిచేపోయింది ఇవేళ.

"టిఫిన్ ఉంది టేబిల్‌మీద..."

"తిని వెళ్ళు."

"నా కది చాలు."

"నీ యిష్టం."

వాడి సమస్యలు వాడివి ... కాని, వాడూ, గోపాల్, ఎలా రాజీపడ్డారో ఆమెకి అంతుపట్టలేదు. ఎప్పుడో గోపాల్‌ని అడిగి తెలుసుకోవాలి.

అనుకుంటుండే హడావిడిగా రానేవొచ్చాడు గోపాల్.

"ఆలశ్యమయిందా?" అన్నాడు ఆత్రతతో.

"లేదు..." అంది రేఖ చిరునవ్వుతో. తన పుట్టినరోజునాడు జరిగిన కథ మళ్ళీ సామాన్య పరిస్థితుల్లో జరగదని ఆమెకి తెలుసును. కాని, నిన్నటిలాటి ఉదంతం మళ్ళీ జరుగుతుందా? నిన్నటిలాగే జీవన్ మళ్ళీ తనని కలియక తప్పదని పట్టు పడతాడా ?

అలిసిపోయి ఉన్నాడు గోపాల్.

మిగిలిన రోజంతా ఆమెకి ఆహ్లాదంగా గడిచిపోయింది. జ్ఞాపకాల ముళ్ళు గుచ్చుకోకుండా ఆమె జాగ్రత్తపడింది.

## 4

అనుకోకుండా ఒకనాడు మాలతి వొచ్చింది. రేఖ పెళ్ళికి ముందే ఆమె మరో ఇంటికి వెళ్ళిపోయింది. అప్పటినించీ వారిద్దరికీ ఎక్కువ కలయికలేదు. ఎప్పుడైనా మాలతి టెలిఫోన్ చేసేది. క్షేమ సమాచారములు చెప్పుకునేవారు.

"అరుణ్ ఎలాగ ఉన్నాడు ?" అని అడిగేది రేఖ తప్పకుండా.

"మామూలే."

"అంటే..."

"అదే! ఏదీ తేల్చడు. ఓసారి పెద్ద కలహమే అయింది మా ఇద్దరికీ- మళ్ళీ అతన్ని చూడాలనిపించలేదు...అతనికీ అలాగే అనిపించి ఉంటుంది."

"అంతా అయిపోయిందా?"

"లేదు-పది రోజుల తర్వాత మళ్ళీ వొచ్చాడు...ప్రాధేయపడ్డం అతనికి చేతకాదుగాని, దానికి దగ్గరగా వొచ్చాడు" అంది మాలతి.

అరుణ్‌ది చిత్రమైన మనస్తత్వం.

పెళ్ళి అనే లాంఛనానికి ముందే దైహికంగా తనకి లొంగిపోయేపాటి నమ్మకం మాలతికి లేదనే బాధా, అలా లొంగిపోయే దౌర్బల్యం ఆమెలో లేదనే సంతృప్తి ఒకదానితో ఒకటి అతనిలో పోటీపడుతూ ఉంటాయి.

మాలతిని చూడగానే రేఖకి చాలా సంతోషం కలిగింది. తామిద్దరూ ఎంతో ఆనందంగా గడిపిన రోజులూ, తాను ఈ ఊరు రాగానే మనసారా స్వాగతం చెప్పిన విషయమూ రేఖ ఎప్పుడూ మరిచిపోలేదు.

"మీ శ్రీవారెక్కడ?" అంది మాలతి.

"రాత్రి ఎప్పుడో వొస్తారు" అంది రేఖ.

"అదేమిటి?...ఇది కొత్త అలవాటా?" అంది మాలతి. రేఖ సంసారంలో ఏం జరుగుతూ ఉంటుందో ఆమెకి కొంతవరకూ తెలుసును

"లేదు-నాలుగైదు రోజులనించి... ఫేక్టరీలో ఏవో కొత్త మిషన్స్ రావడమో ఏదో జరిగిందట..."

"అంతేనా, లేక ఇంటికి రావడం అంటే భయంగా ఉందా అతనికి?" అంటూ నవ్వింది మాలతి. ఆమె ఎంతో సునాయాసంగా నవ్వుతుంది ... తనకి బాధ కలిగించే పరిస్థితుల్లోనూ ఆమె నవ్వగలదు.

"అదేమీ లేదు" అంది రేఖ చాలా తొందరగా, కొంత నిశితంగా.

పరీక్షగా చూసింది మాలతి.

"నిన్నేమీ విమర్శించడంలేదులే-కోపం తెచ్చుకోకు" అంది మాలతి. నాలుగైదు నెలల కిందట రేఖ గోపాల్ గురించి ఏమీ చెప్పడానికే ఇష్టపడలేదు-ఆ విషయమే ఆమెకి రుచికరంగా ఉంది. అది మాలతికి బాగా జ్ఞాపకం ఉంది.

"నీ మీద కోపం...నా కెప్పుడూ రాదు" అంది రేఖ చిరునవ్వుతో. మాలతి మనసు కొంచెం గాయపడిందని ఆమె గ్రహించింది.

"మీ జీవన్ ఎలాగ ఉన్నారు?" అంది కొద్ది క్షణాల తరవాత మాలతి.

ఒక్కసారి రేఖ ముఖంలో రంగులు మారడం గమనింపగలిగింది ఆమె. అక్కడినించి రేఖ మనస్సు క్షణికంగా దూరదూరాలకి పోవడమూ గమనించగలిగింది మాలతి.

"నీ మాట చెప్పు...మీ అరుణ్ ఏమంటాడు? అంది రేఖ. సంభాషణలో విషయంమార్చే ప్రయత్నం దాచుకోలేదు రేఖ.

"అది చెప్పడానికే వొచ్చాను" అంది మాలతి. ఆమె కళ్ళనిండా వెలుతురు. రేఖ ఒక్కసారిగా ఆమెని కౌగలించుకుని, "ఎంత మంచివార్త మోసుకొచ్చావు!" అంది. ఆమె నిజానికి మాలతిని గురించి చాలా బాధపడ్డది. తన స్వంత బాధలో ఆమె ఆ బాధను వెలికి రానీయలేదు. అంతే.

"నువ్వు సంతోషిస్తావని తెలుసును" అంది మాలతి.

"సంతోషమా! డేన్సు చెయ్యాలని ఉంది!" అంది రేఖ, ఆనందంలో తేలిపోతూ. "చెప్పు-నాకు వివరాలన్నీ కావాలి! ... నీటిలో చేపని చేతుల్తో పట్టుకున్నంత కష్టమైన పని ఎలాగ చేసేవు?" అంది.

"ఇలాటి చేపలకి కొన్ని చేతుల్లో చిక్కిపోవాలని బుద్ధిపుడుతుంది" అంది మాలతి.

రేఖకి అంతరాంతరాలలో ఎక్కడో చిన్న స్పందన కలిగింది.

"అలాగ కాదు-వివరాలు కావాలి" అంది రేఖ. మాలతికి చెప్పాలని ఉంది. అరుణ్‌కీ, ఆమెకీ చివరి ఘర్షణ రేఖకి తెలుసును.

"నా మీద ఆ మాత్రం నమ్మకంలేదా!" అన్నాడు అరుణ్.

"నమ్మకం, అప నమ్మకం కాదు—నా సూత్రాలు నాకున్నాయి నీతో కలిసి తిరిగేనని, నీతో స్వేచ్ఛగా మాట్లాడేననీ, నన్ను వివాహం చేసుకునే ఉద్దేశం నీలో ఎక్కడో ఉందనీ, ఈ కారణాలవల్ల కోరికలన్నీ ఇప్పుడే తీర్చడం నా అభిమతం కాదు" అంది మాలతి.

"నిన్ను మోసం చెయ్యను..." అన్నాడు అరుణ్ "నీకేం ప్రమాదంలేదు- మనం ఆధునిక యుగంలో ఉన్నాము. అమ్మమ్మల కాలంలో కాదు" అన్నాడు.

"శరీరానికి జరిగే ప్రమాదం ఒక్కటేకాదు నేను ఆలోచిస్తోన్నది...నువ్వు మోసం చేస్తావా చెయ్యవా అనీ ఆలోచించడంలేదు..." అంది మాలతి.

"మరి!"

"నా కిష్టంలేదు. ఇది ఏ యుగమైనా, వ్యక్తిగా నా సూత్రాలు నాకు ఉన్నాయి..." అంది మాలతి.

"నన్ను దూరంచేసుకుంటున్నావు..." అన్నాడు అరుణ్.

"నాకు దగ్గరగా ఉండడానికి ఇదే షరతు అయితే, దూరంగానే ఉండు" అంది మాలతి.

"అంటే, నా మీద ప్రేమ లేదన్నమాట" అన్నాడు అరుణ్.

"అలాటిదే ప్రేమ అయితే, లేదు" అంది మాలతి.

పార్కులో జరిగింది ఇదంతా. అతను లేచి, స్కూటర్‌మీద వెళ్ళిపోయాడు. ఇంకేమీ అనకుండా. ఆ మధ్యనే కొన్నాడు స్కూటరు.

అది జరిగాక రెండు నెలలు మాలతికి కనిపించలేదు.

ఆ తరవాత ఒకనాడు మాలతికి ఆఫీసులో ఫోన్ చేశాడు.

మాలతి మాట్లాడలేదు.

ఆ ఆదివారం మధ్యాహ్నం వొచ్చాడు. వొస్తూనే, "నీ జాతకం ఇయ్యి" అన్నాడు ఉపోద్ఘాతం లేకుండానే.

అడగకుండానే మంచిసిరిచ్చి, "ఎందుకు?" అంది మాలతి.

"మరెందుకు ? ముహూర్తాలు పెట్టించడానికి'' అన్నాడు ఎటో చూస్తూ.

లోపలికి వెళ్ళి కాఫీచేసి తెచ్చింది మాలతి.

"కాఫీ కోసం రాలేదు... జాతకం కోసం వచ్చాను" అన్నాడు అరుణ్.

ఈ ఓటమి అతనిలో కలిగించిన మార్పుని జాగ్రత్తగా గమనిస్తోంది మాలతి. కాని తన గెలుపులో ఉన్న ప్రమాదం ఆమెకి తెలుసు.




"కాఫీ తాగు" అంది.

తాగి, "జాతకం ఇవ్వాలనిలేదా ?" అన్నాడు అరుణ్.

చల్లగా, "లేదు" అంది మాలతి.

ఆ జవాబుకి అతను సిద్ధంగానే ఉన్నాడల్లే ఉంది. "సరే, తరవాత నన్నేమీ దూషించకు" అన్నాడు

"దూషించను" అంది మాలతి. కన్నీళ్ళు ఏ క్షణాన్నైనా వొచ్చేసేలా ఉన్నాయి. కాని, లోలోపల ఏదో శక్తి ఆమెకి సహాయం చేస్తూంది.

"వెడతాను" అన్నాడు లేచి నిలబడి, అతను.

మాలతి మాట్లాడలేదు...లోపలికి వెళ్ళి మంచంమీద బోర్లా పడుకుని ఏడుపు ఆపుకొంటూంది. అతని స్కూటరు శబ్దంకోసం ఎదురుచూస్తోంది.

ఆ శబ్దం రాలేదు.

రెండు చేతులు మాలతిని చుట్టేశాయి- "కొంచెం తెలివితక్కువని క్షమించలేవా, మాలతీ !" అంటూ అరుణ్ ఆమెని తన చేతుల్లోకి తీసుకున్నాడు...

అంతా చెప్పి, "వచ్చే శుక్రవారం ముహూర్తం !" అంది మాలతి. "నమ్మిక లేకపోతే, ఇదుగో కార్డు !" అంటూ ఇచ్చింది.

కార్డు చూస్తూ ఉండిపోయింది రేఖ.

"ఏమిటి ఆలోచిస్తున్నావు ?" అంది మాలతి

"నువ్వు... చాలా సుఖపడాలని దైవాన్ని కోరుకుంటున్నాను... కాని, ఏదో భయం- ఇన్ని మార్పుల తరవాత" అంది రేఖ

హాయిగా నవ్వింది మాలతి.

"భయపడకు... అతన్ని నేను నిజంగానే ప్రేమిస్తున్నాను. తప్పకుండా సుఖపడతాను" అంది.

ఈసారి రేఖలో స్పందన బలంగా ఉన్నది.

"ప్రేమించినవాళ్లంతా సుఖపడతారా ?" అంది రేఖ కొంచెం పొడిగా- చిత్రంగా, ఆ ప్రశ్న వెనక తానే లేదు. గోపాల్ ఉన్నాడు.

"సారీ ! అది కాదు నా ఉద్దేశం..." అంది మాలతి

"సారీ చెప్పకు... నీ మంచి కోరికలు నాకూ మంచి చేస్తాయి" అంది రేఖ

క్రమంగా వాళ్లిద్దరి సంభాషణా ఇతర విషయాలమీదికి వెళ్లింది.

పది దాటుతోందే గోపాల్ వచ్చాడు.

బాగా అలిసిపోయి ఉన్నాడు. స్నానం చేసినా అలసట పోలేదు.

పేరుకి వాళ్ళిద్దరితో ఏదో తిని, వొద్దంటున్నా మాలతిని డ్రాప్‌చేసి వచ్చాడు.

రాత్రి అతను అశాంతితో నిద్రపోలేకపోయాడు.

అతని కదలికలకి తెలివి వొచ్చింది రేఖకి. మామూలుగా లేదు అతని ముఖం.

"ఒంట్లో బాగులేదా ?" అని, అతని గుండెలమీద చెయ్యి వేసింది రేఖ.

"అలిసిపోయాను" అంతే... అని, లేచి కూర్చుని- "నువ్వు అలిసి పోయావు...నా ప్రక్కన నీకూ నిద్రరాదు. నేను అవతలిగదిలో పడుకుంటాను. నిద్రపో-" అన్నాడు గోపాల్ నిలబడుతూ.

చెయ్యలాగి అతన్ని కూర్చోబెడుతూ, "ఫరవాలేదు- పడుకోండి... రెండు రోజులు విశ్రాంతి తీసుకోకూడదూ ?'' అంది రేఖ.

గోపాల్ దిండుమీద జారబడి రేఖని తన చేతుల్లోకి తీసుకుని, "చాలా రోజులు విశ్రాంతి... ఆ ఉద్యోగాన్ని రిజైన్ చేశాను'' అన్నాడు.

ఆశ్చర్యంగా, "ఏం ?– ఏమయింది ?" అంది రేఖ.

ఆమెని మరికొంచెం దగ్గరగా తీసుకుని, "కొత్తమెషీన్ల విషయంలో అమెరికా రెండు నెలల పనికోసం వెళ్ళరమ్మన్నారు-" అన్నాడు గోపాల్.

"బాగుంది... మరేం?" అంది రేఖ.

"నాకేగాని, భార్యకి లేదుట !- నాకు కోపంవొచ్చింది" అన్నాడు గోపాల్.

"లేకపోతే ఏం ?... మీరు చాలా కాలంనించి కోరుకుంటున్నది అమెరికా వెళ్లాలనేగా ?" అంది రేఖ.

"నిజమే. కాని, ఎంత సేవ చేసేను వాళ్ళకి ? కిందటి సంవత్సరం సుమారు కోటి రూపాయిల లాభం తీశారు. ఈ చిన్న మాటకి వాళ్ళు కాదని ఎందుకనాలి?" అన్నాడు గోపాల్.

కొంచెం ఆగి, "తొందరపడ్డారేమో !... వెళ్ళిరావలసింది" అంది రేఖ

"ఎలా వెళ్లేది రేఖా !" అన్నాడు గోపాల్. "నువ్వు పక్కన లేకుంటే నాకక్కడ ఏంబావుంటుంది ?"

"అందుకని- ఇంతకాలం పనిచేశాక రిజైన్ ఇచ్చేశారా !"

విమర్శలాగ అనలేదు రేఖ. ఆమె చలించిపోయింది. బాధగా అంది.

"అవును- నాకు విచారంలేదు... కాని నీకు అభ్యంతరం ఉంటే- నాకెంత అనిష్టంగా ఉన్నా వాళ్లదగ్గరకి వెళ్ళి ఉపసంహరించుకుంటాను" అన్నాడు.

ఇన్నివొందల రోజుల్లో ఆమె చేతులు మొట్టమొదటిసారి అతని చుట్టూ బిగుసుకున్నాయి. అతనెంత పౌరుషం ఉన్న మనిషో ఆమెకి తెలుసును.

"వొద్దు వొద్దు- నా కోసం మీరలాగ చెయ్యొద్దు" అంది రేఖ- ఆమె ముఖం అతని గుండెలమీద ఉంది.

వెచ్చటి కన్నీళ్ళు అతన్ని ఆశ్చర్యపరిచాయి.

"ఏడుస్తున్నావా రేఖా ?..." అన్నాడు.

"అవును... కాని, మీరనుకుంటూన్నది కారణం కాదు..." అంది రేఖ. అతనికెలాగ చెప్పడం?

"నువ్వు—"

ఏదో అనబోయిన అతన్ని ఆపేసింది రేఖ. "మీరు నిద్రపొండి..." అంది.

ఆమె వెచ్చటి బరువుకింద గోపాల్ ఏమీ మాటలాడే ప్రయత్నం చెయ్యలేదు. ఉండీ ఉండీ వేగం హెచ్చయ్యే ఆమె హృదయ స్పందన అతనికి సుఖవుగా నిద్ర రానీయలేదు.

కొత్త కొత్త రాత్రిలాగ ఉంది

మర్నాడు ఆఫీసుకి నెలరోజులు సెలవుకి ఉత్తరం పంపింది రేఖ.

ఆ ఉత్తరం చూస్తూనే ఫోన్ చేసేడు జీవన్.

"రేఖా ! ఏమిటీ ఉత్తరం ?" అన్నాడు. గోపాల్ గార్డెన్‌లో ఏదో చేస్తూండ డాన్న ఆమె టెలిఫోన్ ఎత్తింది.

"ఏమీలేదు... సెలవుకావాలి. అంతే !" అంది రేఖ.

"కాని... హఠాత్తుగా ఏమిటిది ?" అన్నాడు జీవన్.

"అలా అవసరం వొచ్చింది."

"ఆ రోజు... జరిగినదానికి కోపం వొచ్చిందా ?"

కళ్ళు మూసుకుంది రేఖ.

ఆ రోజు...

"ఇంక... నీ నించి దూరంగా ఉండలేను" అన్నాడు జీవన్- "ప్లీజ్ !...నా మనస్సు నీకు తెలుసును" అన్నాడు. ఇంత కాలంనించి అతనలాటి బలవంతం చెయ్యలేదు

"మీరు... దయచేసి బలవంతం చెయ్యవొద్దు" అంది రేఖ- అతని చేతుల నించి తప్పించుకుంటూ. ఆ మధ్య అతను తీసుకున్న గెస్ట్‌హౌస్‌లో అతన్ని కలుసుకుంది. అదీ అనిష్టంగానే. కొంత కాలంనించీ అతన్ని కలుసుకోవడం చాలా తగ్గించింది కష్టపడి. మనస్సు ఒకవేపునించి అతన్ని కలుసుకోవాలని కోరుకుంటూన్నా, మరోవేపు నేరం చేస్తోన్నట్టు ముళ్ళగుచ్చుతోంది. కాని అతను ఎంతో బాధగా పిలిచాక ఒక్కసారి వెళ్ళివొద్దామనుకుంది...

మొదట అతను ఎప్పటి జీవన్‌లాగే ఉన్నాడు- ఈ మధ్య అతని భార్య పుట్టింటికి వెళ్లడంతో కొంత సుఖశాంతులకి నోచుకున్నాడు.

"నీ సంసారం ఎలా ఉంది ?" అన్నాడు.

"సాగుతోంది" అంది రేఖ జరుగుతున్నది మనసులో పెట్టుకుని.

"నువ్వు- జీవన్‌ని మరిచిపోవుకాదూ ?" అన్నాడు ఆశిస్తూన్నట్టు.

"మీ ఉపకారం ఎన్నటికీ మరిచిపోను... మిమ్మల్ని మరిచిపోను" అంది రేఖ. అతన్ని గురించిన నిజం ఆ క్షణంలో ఆమెకే స్పష్టంగా లేదు.

"నువ్వు నాదానివి... ఎప్పుడూ అంతే" అన్నాడు జీవన్.

రేఖ మాటాడలేదు

"నువ్వు లేకుండా బ్రతకలేను- నా చుట్టూ ఉన్న ఈ అంధకారంలో నువ్వే నాకు ఒక్క దీపానివి" అన్నాడు జీవన్, హటాత్తుగా తనని చేతుల్లోకి తీసుకుంటూ.

"కాని... నేను ఇప్పుడు మరొకరి భార్యని, జీవన్ !" అంది, రేఖ అతన్ని విడిపించుకుని.

"నాకు తెలుసును- ప్రతి స్త్రీకి ఒక భర్త ఉండాలి- లేకపోతే సుఖం మర్యాద, ఉండవు. కాని, నీకు ప్రేమించేవాడూ ఉండాలి... నాలాగ ఎవరు నిన్ను ప్రేమిస్తారు?" అన్నాడు జీవన్. అతని మాటల్లోకి ఉద్వేగం వొచ్చింది.

గోపాల్ కౌగిటిలో అప్పటిదాకా ఆమెకి జీవన్ జ్ఞాపకం వచ్చేవాడు.

ఇప్పుడు ఆమె మళ్ళీ కౌగిలించుకున్న జీవన్ చేతుల్లో ఉన్నప్పుడు గోపాల్ జ్ఞాపకం వొస్తున్నాడు. అద్దం మీది కార్డు- ఐ లవ్ యూ ఆకాశమంత కనిపిస్తోంది.

ఇంతకుముందు ఎన్నోసార్లు జీవన్ ఒక్క అడుగు తన పరిధిలోకి వేస్తే రేఖ రెండడుగులు అతనివేపు వేసి ఉండే పరిస్థితులు, నిమిషాలు ఉన్నాయి. కాని, రేఖకిప్పుడు ఆలోచనలు వేరుగా ఉన్నాయి.

"వొద్దు జీవన్!... మన మధ్య పవిత్రమైన భావన ఎంత ప్రేమతోనయినా సరే- ఉండాలి. మీరే చెప్పేరు" అంది రేఖ

"ఈ మధ్య నన్ను కలవడమేలేదు నువ్వు- నేను పిచ్చివాడినయిపోయాను." అన్నాడు ఇంకా ఉద్వేగంతో జీవన్. అతని చర్యలు ఆ మాటలు నిజం అని నిరూపిస్తున్నాయి. అతని శారీరిక వాంఛలు జరిగినదానికి నల్లటిరంగులు వేస్తున్నాయి.

ఒక్క క్షణం నీరసించి ఆమె జీవన్ కోరినట్టు చేద్దామనుకుంది.

కాని తనకే తెలీని ఏదో బలీయమైన అనిష్టత ఆమె పెనుగులాడి అతన్ని విడిపించుకునే శక్తి, తలుపు తీసుకుని అవతల పడే యుక్తి ఆమెకి కలిగించాయి. రొప్పుతూ రెండోఫ్లోర్‌నించి మెట్లుదిగి వొచ్చిన రేఖకి దేవుడిచ్చిన వరంలాగ టేక్సీ కనిపించింది. ఇంటికొచ్చేసింది.

"హల్లో! రేఖా!... అక్కడే ఉన్నావా?" అన్నాడు జీవన్.

"ఉన్నాను" అంది కళ్ళు తెరిచి, రేఖ.

"ఆ రోజు నీకు నిజంగానే కోపం వచ్చింది" అన్నాడు జీవన్. "పొరపాటు చేశాను. క్షమించు"

రేఖ ఏమీ అనలేదు.

"నిన్ను కనీసం చూడకపోతే బ్రతకలేను" అన్నాడు జీవన్. అందుకే తన ఉద్యోగం మార్పుచేసి తనని దగ్గరగా పెట్టుకున్నాడు.

"నాకు తెలుసు. కాని, పరిస్థితులు మారాయి" అంది రేఖ.

"నాకూ నీకూ మధ్య ఏమీ,ఎప్పుడూ మారవని వాగ్దానం చేశావు" అన్నాడు

జీవన్. అదీ నిజమే. ఎప్పుడో, తన ప్రేమనంతటినీ అతని మీద కేంద్రీకరించి, ఇంకేమీ తనకి లేని రోజుల్లో నిజంగానే తానలా వాగ్దానం చేసింది.

"వొద్దు జీవన్... ఆ మాటలు జ్ఞాపకం చెయ్యకు" అంది రేఖ. "అవన్నీ మరిచిపో."

జీవన్ క్షణకాలం మాట్లాడలేదు.

"పోనీ- కనీసం ఆఫీసుకి రా" అన్నాడు.

"ఈ నెలా పోనీ."

"నిన్ను చూడాలి- ఇంటికి వస్తాను"

"వొద్దు వొద్దు. ఆయన సెలవులో ఇంటిదగ్గిర ఉన్నారు" అంది రేఖ.

"మీరిద్దరూ..." అని ఆగిపోయాడు. ఇంక ఏమీ అనకుండా ఫోన్ డిస్కనక్ట్ చేసేశాడు జీవన్.

నీరసంగా కూర్చుని హటాత్తుగా వచ్చిన ఈ కొత్త పరిస్థితిని గురించి ఆలోచించసాగింది రేఖ. మరొకసారి తన జీవితంలో మలుపు వచ్చిందని ఆమెకి ఇప్పుడు పూ రిగా అర్థమైంది.

అన్యమనస్కంగానే వంటచేసింది.

ఒంట్లో బాగులేనట్టు ఉంది.

మనస్సంతా అల్లకల్లోలంగా ఉంది.

డ్రైవర్‌ని పిలిచి గోపాల్‌కి లోపలికి రమ్మని కబురుపెట్టింది. చేస్తోన్న పని వదిలివొచ్చి, "ఏం పిలిచావట ?" అన్నాడు గోపాల్.

మనిషి అలిసి చెమట పట్టినట్టు ఉన్నాడు.

"అక్కడ ఇంత ఎండలో పనిచెయ్యాలా ?... చాలు లోపలికి రండి. ఎండ మండిపోతోంది" అంది.

"అవును." అని స్నానానికి నడిచేడు గోపాల్.

అతను వచ్చేసరికి కూల్‌డ్రింక్ తయారుచేసి ఉంచింది. తృప్తిగా తాగి, "ఇది చాలా హాయిగా ఉంది," అన్నాడు గోపాల్.

"అవును ఎండలోనించి వచ్చాక అలాగే ఉంటుంది" అంది రేఖ.

"అదికాదు. ఎన్నాళ్లయింది మనం ఇంత విశ్రాంతి తీసుకుని ?" అన్నాడు, గోపాల్. పెళ్ళి తరవాత అమ్మకి అంత ఇష్టంలేకా, అతనికింత అవకాశం లేకా, నాలుగైదు రోజులకన్న సెలవు పెట్టి ఎక్కడికీ తిరగలేదు.

"అవును" అంది రేఖ. ఒక్కసారిగా ఆమెకి ఈ పరిసరాలు వదిలి వెళ్ళి

కొన్నిరోజులు తిరిగి రావాలనీ, పూర్వపు ఈ వాసనలన్నిటినీ కడిగివెయ్యాలనీ అనిపించింది.

''ఎక్కడికైనా పోదాం'' అన్నాడు గోపాల్. ఆమె ఆలోచనలకి ప్రతిధ్వని లాగ.

"బాగుంటుంది.'' అంది రేఖ. అతని నిరుద్యోగ పరిస్థితి ఆమెకి జ్ఞాపకం వచ్చి కొంత సందేహించింది. కానీ, అతనాట్టే కాలం అలాగ ఉండిపోడని ఆమెకి తెలుసును. తనకే ఇంక బహుశా ఉద్యోగం దొరకదు. జీవన్ ఏం చేసినా, చెయ్యకపోయినా, తాను మళ్ళీ అక్కడికి వెళ్ళి ఉద్యోగం చెయ్యడం మరిచిపోవాలని ప్రయత్నిస్తోన్న గతాన్ని మళ్ళీ మళ్ళీ తవ్వడమే అవుతుంది. కాని, ఆ మాట అతనికిప్పుడు చెప్పనక్కరలేదు.

''ఎటు వెడదాం?" అన్నాడు గోపాల్.

''మీ ఇష్టం'' అంది రేఖ.

"కాదు. ఆలోచించి చెప్పు..." అన్నాడు గోపాల్. అతనికి రాత్రి నిద్రలేని కారణాన ఆవులింతలు వస్తున్నాయి.

"ముందర లంచ్ కానివ్వండి- తరవాత ఆలోచిద్దాం" అంది రేఖ. ఆమెకే అలసటగానే ఉంది

నిద్రపోయి ఆమె లేచేసరికి టెలిఫోన్ మోగుతోంది.

తొందరగా వెళ్ళి రిసీవరు తీసింది- క్షణికంగా ఆమె గుండెలు కొట్టుకున్నాయి. జీవన్ కాదుగదా! అని.

కాదు.

గోపాల్ ఫ్యాక్టరీనించి— అతనికోసం.

"ఆయన నిద్రపోతున్నారు" అంది రేఖ. అంత గాఢనిద్రలో అతన్ని లేపడం ఆమెకిష్టంలేదు.

"నేను ఫోన్‌చేసేనని చెప్పండి" అని నెంబరూ పేరూ ఇచ్చాడు అవతలినించి.

ముఖంకడుక్కుని బొట్టుపెట్టుకుని రేఖ టీ తయారుచేసి తాగుతుంటే గోపాల్ వచ్చాడు. అతనికి టీ ఇచ్చి తాగుతోంటే టెలిఫోన్ మాట చెప్పింది.

"వాళ్ళు బేరాలకి దిగుతారు..." అన్నాడు గోపాల్ టీ తాగుతూ.

రేఖ ఏమీ అనలేదు. తానేమన్నా గోపాల్ అలాగే చేస్తాడని తెలిసి, ఆమె జాగ్రత్తగా ఊరుకుంది. ఏ జవాబు ఇచ్చినా అందులో ఏదో ఒకరకం సూచన ఉండి తీరుతుంది.

"పద. ఏదైనా సినిమా చూద్దాం" అన్నాడు గోపాల్.

సాయంత్రం సినిమా చూసి, టిఫిన్‌తిని ఇంటికి వచ్చేశాము– వెన్నెల రాత్రిలో చాలాసేపు గార్డెన్‌లో కూర్చున్నారిద్దరూ.

"ఇలా– బాగుంది." అన్నాడు గోపాల్.

"అవును" అంది రేఖ

అంతకన్న ఎక్కువ మాట్లాడుకోలేదు. రేఖకి ఎంతో శాంతిగా అతనిమీద ఆప్యాయత ఆమెలో వెల్లి విరుస్తోంది.

నిశ్చలంగా కూర్చుని, తృప్తిగా తన వైపు చూస్తూన్న అతను మొట్ట మొదటిసారి తన జీవితంలోకి రావడం ఆమెకి జ్ఞాపకం ఉంది.

ఆ సాయింత్రం నాలుగు దాటాక వొచ్చాడు గోపాల్ తన ఆఫీసుకి జీవన్ కోసం.

"ఆయన బాంబే వెళ్ళేరు" అంది ఏవో కాగితాలు చూసుకుంటూ రేఖ. విచిత్రంగా, అతన్ని ఆకృతిని సరిగా గమనించనేలేదు తానప్పుడు.

"కాని–నాకు మా సరుకులు అర్జెంటుగా డెలివరీ కావాలి" అన్నాడు యుద్ధంలో ప్రతిపక్షితో వాదిస్తోన్న యోధుడిలాగ.

"మేనేజర్‌ని చూడండి" అంది రేఖ.

"చూశాను–అతనికేమీ తెలిసినట్టులేదు."

"మీరు–" అంది రేఖ; అని, ఆగిపోయింది. మీరెవరని ప్రారంభించి ఎందుకో ఆగిపోయింది.

తన కార్డు తీసి ఆమె ముందు పెట్టేడు గోపాల్.

రెండుసార్లు చదివింది. ఆ ఫాక్టరీకి చాలా సరుకులు సప్లై చేస్తుంది జీవన్ కంపెనీ.

"నేను కూర్చోవొచ్చా?" అన్నాడు గోపాల్ కొంచెం తగ్గిన ఉధృతంతో.

సిగ్గుపడి, "సారీ! దయచేసి కూర్చోండి..." అంది రేఖ. "కాఫీ తాగుతారా?" అంది.

"వొద్దు...నా సరుకుల మాట ఏమిటి?" అన్నాడు గోపాల్.

"చూసి చెప్తాను" అంది రేఖ.

అతన్ని కూర్చోనిచ్చి ఆఫీసులో అరగంట వెతికి, "సారీ? వాటిని గురించిన కాగితాలేవీ రాలేదు" అంది రేఖ. అతని ముఖంలో ఉన్న నిరాశ చూసి, "కావాలంటే బాంబే ఆఫీసునించి వివరాలు తెలుసుకుని చెప్తాను."




''కాని, రాత్రికి రాత్రే నాకు కావలసిన సరుకులు... ఫేక్టరీ ఆగిపోతుంది అవి లేకపోతే" అన్నాడు గోపాల్.

''ఏం చేసేది!" అంది రేఖ. అతనికి సహాయం చెయ్యాలని ఉంది. కాని, సరుకులకు సంబంధించిన కాగితాలు రాలేదు. జీవన్ కంపెనీ వాటిని బొంబేలోనో, కలకత్తాలోనో కొని తెచ్చి ఇచ్చి ఖరీదుమీద కమిషన్ తీసుకోడం మామూలు. సరుకుల మాట తెలుసుకోవాలంటే చాలా శ్రమ.

''మీకు చేతనైనది చెయ్యండి" అన్నాడు గోపాల్.

అన్నీ చేసింది రేఖ ఎందుకో ఈ మనిషికి సహాయం చెయ్యాలని అనిపించింది. బొంబేకి టెలిఫోన్ చేసి, కలకత్తాకి చేసి, రైల్వేపార్సెల్ నంబర్లు తెలుసుకుని చివరికి ట్రేస్ చేసింది. మిగిలిన పనులు మేనేజరుకి వొప్పజెప్పింది. అతను స్టేషనుకి వెళ్ళి పార్సెల్స్ తీసుకుని రాత్రికి రాత్రే ఫేక్టరీకి చేరవేస్తాడు.

అన్నీ ముగిసేసరికి రాత్రి తొమ్మిదయింది.

''మీకు చాలా శ్రమ ఇచ్చాను-థేంక్స్" అన్నాడు గోపాల్. అంతసేపూ అతను రేఖ దగ్గరే కూర్చున్నాడు.

''డోంట్ మైండ్...మీ పని ముగిసినందుకు నాకూ సంతోషంగా ఉంది" అంది రేఖ, ఇంటికి వెళ్ళడానికి లేస్తూ.

''కాని, నాకు సంతోషంగాలేదు'' అన్నాడు ఆమెతో బయలుదేరుతూ గోపాల్.

వెళ్లబోయి, ''ఏం ?'' అంది రేఖ.

''మళ్ళీ రేపు మీతో ఇలాగ గంటలకొద్దీ గడపడం కుదరదు...'' అన్నాడు గోపాల్.

రేఖ చిరునవ్వుతో, ''మరికొన్ని పార్సెల్స్ కోసం వొస్తేసరి !'' అంది.

''అలాగే చేస్తాను...మీ సూచన బాగుంది'' అన్నాడు గోపాల్ నిజానికి అతను అలాగ అంత సేపు కూర్చుంటే ఆమెకి శ్రమ అనిపించలేదు.

''నేను...సీరియస్‌గా అనలేదు'' అంది రేఖ తొందరగా.

''నాకు నిరాశ కల్పించేరు !'' అన్నాడు గోపాల్ నవ్వుతూ. నవ్వుతూంటే ఇంకా బాగున్నాడు అతను.

''సారీ'' అంది రేఖ ఆఫీసు బయటికి నడుస్తూ.

''పదండి-మీ ఇంటి దగ్గర డ్రాప్ చేస్తాను'' అన్నాడు గోపాల్.

''వొద్దు-తిన్నగా బస్సు ఉంది'' అంది రేఖ మొహమాటంతో.

''ఉంటే ఉండనివ్వండి...అసలు డిన్నర్ తీసుకుని మరీ వెళ్లాలి'' అన్నాడు.

రేఖ ఎంత వొద్దన్నా అతను వినిపించుకోలేదు. చివరికి రేఖ ఇంటికి వెళ్ళి ఆమె బట్టలు మార్చుకున్నాక డిన్నర్‌కి వెళ్ళి రాత్రి పన్నెండు అవబోతోంటే తిరిగి ఇంటికి తీసుకొచ్చేడు

థేంక్స్ చెప్పి, ''మీ వాళ్ళు ఎదురుచూస్తూ ఉంటారు పాపం !'' అంది సిన్సియర్‌గా రేఖ.

నవ్వి, ''మా 'వాళ్ళు' ఎవరూలేరు. బ్రహ్మచారిని'' అన్నాడు గోపాల్.

కారు దిగి ఇద్దరూ బయట నిలబడ్డారు.

చీకటిగా ఉంది. మినుకు మినుకుమంటోన్న నక్షత్రాల గుడ్డి కాంతి తప్పిస్తే.

రేఖ మళ్ళీ ధన్యవాదాలు చెప్పి వెనుదిరిగింది.

''రేఖా ! ఒక్కమాట'' అన్నాడు గోపాల్. ఆ నిశ్శబ్ద పరిసరాలలో చాలా గట్టిగా వినిపించింది ఆ పిలుపు రేఖ ఆగి వెనక్కి వొచ్చింది.

''ఏమిటండి ?'' అంది.

''మీరు నన్ను పెళ్ళిచేసుకోండి'' అన్నాడు శరీరంలో కదలిక లేకుండానే, గోపాల్.

మూడు నాలుగు నిమిషాలు అలాగే నిలబడిపోయింది రేఖ. సాయంత్రంనించీ ఎంతో సరదాగా ఉన్న ఈ మనిషి' ఒక్కసారి ఇంత సీరియస్‌గా ఇలాగ

అడుగుతాడని ఆమెకి సూచన కూడా లేదు.

''మీరు–'' అంది రేఖ.

''తొందరపడుతున్నారంటారు-నా వివరాలడగండి. అన్నీ చెప్తాను. దాచుకోవలసిన రహస్యాలేవీలేవు నా జీవితంలో...''

అప్పటికి కొంచెం స్టెడీ అయింది రేఖ.

''కాని నా గురించి మీకేమీ తెలీదు'' అంది నీరసంగా. ఆమె జీవన్‌ని తలుచుకుంది. అత నా క్షణాలలో చాలా దూరంగా ఉన్నట్టు కనిపించేడు.

''మీ గురించి అంతా చెప్పండి-వింటాను. సిగ్గుపడవలసినదీ, నాతోగాని, మరెవ్వరితోగాని చెప్పకూడనిది మీ జీవితంలో ఏమీ ఉందనుకోను'' అన్నాడు గోపాల్.

ఏమని చెప్తుంది ?

కాదనాలని, తొందరగా అతన్ని పంపెయ్యాలనీ, లేదు.

కాని, అవుననాలనే ధైర్యంలేదు.

జీవన్.

ఆతనితో జరుగుతోన్న కథకి అంతం ఉండదు-అశృవుల్లోతప్ప....గోపాల్ ...ఇతను-మరో రకం మనిషి.

''రేపు-మాట్లాడుకుందాం'' అంది చివరికి.

''అలాగే! కాని, మరీ తీవ్రంగా ఆలోచించకండి ... నేను చాలా గౌరవనీయుణ్ని. మీరు నాకు చాలా చాలా నచ్చారు...'' ఆమె ఏదో అనబోయింది. ''నా కార్డు ఉంచుకొండి-రేపు సాయంత్రం వొస్తాను'' అన్నాడు.

''ఆఫీసుకి రావొద్దు...''

''సరే. అయిదున్నరకి ఇక్కడికే వొస్తాను'' అన్నాడు.

వెనుదిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు గోపాల్. రేఖకి ఇప్పటికీ బాగా జ్ఞాపకం...నీరసంగా గేటుమీద ఆనుకుని కారు ఎర్రదీపాలు మలుపు తిరిగి మాయమయ్యాక కూడా ఆమె అలాగ చూస్తూనే ఉండిపోయింది.

ఆ రాత్రి అంతా ఆమెకి ఒకటే ఆలోచన.

జీవన్.

అతన్నించి దూరం కాగలదా ?

అతనూ తననించి దూరం కాగలడా ?

అతనేమంటాడు ?

కాదంటే ?

కాని తన జీవితం ? తానూ జీవించాలి—తాత్కాలికంగానైనా ఈ కథకి ఒక మలుపు ఉండాలి.

ఆకర్షణీయంగా ఉన్నాడు గోపాల్, జీవన్ కన్నా. కాని అతనిలో ఉన్న అనురాగం ఇతనిలో ఉంటుందా ?

ఏదీ ఎక్కువ ఆలోచించి చేసే మనస్తత్వం కాదు గోపాల్‌ది. క్షణికోద్రేకంలో పెళ్ళిదాకా వొచ్చేశాడు!

రేపు మనసు మార్చుకుంటే ?

ఆలోచనలు ముసురుకుంటున్నాయి. అశాంతి, ఆశ, భయం—అన్నీ సమూహంగా బాధపెడుతున్నాయి.

రాత్రి ఎలాగో గడిచింది.

ఉదయం ఆఫీసుకి వెళ్ళేసరికి జీవన్ రానే వొచ్చాడు. అతను ఆమెని చిరునవ్వుతో పలకరించాడు.

ఆమెకి అతన్ని మళ్ళీ చూడడం ఎంతో సంతోషంగా ఉంది.

గోపాల్ ఎంతో దూరంగా వెళ్ళిపోయాడు ఆలోచనల్లో.

"బాగున్నారా ?" అంది జీవన్‌ని.

"అక్కడా ? నువ్వు లేకుండానా ?" అన్నాడు జీవన్.

రేఖ ముఖం చిరునవ్వుతో వెలిగిపోయింది. ఏమీ కోరకుండా అన్నీ ఇచ్చేసే మనిషి జీవన్. ఇతనికెలాగ దూరమవను ? అనుకుంది.

కాని...

ఆలోచనలు రాకుండా, గోపాల్ కార్డు జీవన్ ముందు పెట్టి, "అతను నన్ను పెళ్ళి చేసుకుంటాడుట..." అంది

క్షణకాలం స్తంభించిపోయాడు జీవన్.

తరవాత చిరునవ్వుతో, "నీకు నచ్చాడా ?" అన్నాడు.

రేఖ ఏమీ అనలేదు.

"కొంచెం సంగతులు కనుక్కోనీ...తొందరపడకు" అన్నాడు.

సరేనంది.

నాలుగ్గంటలకి గోపాల్ ఫోన్ చెయ్యడం ఆమెకి వాయిదా కోరే అవకాశాన్ని ఇచ్చింది. కాని, ఆమె ఏమీ అనేలోపునే, గోపాల్, రెండు కారణాలవల్ల మీకు ఫోన్ చేశాను" అన్నాడు.

"ఏవిటవి ?" అంది రేఖ.

"ఒకటోది మీ గొంతుక వినడానికి..." అన్నాడు.

"విన్నారు..." అంది రేఖ. ఈ సంభాషణ ఆమెకి చిత్రంగా ఉంది. లోలోపల తియ్యటి సంతృప్తి.

"రెండోది-సాయంత్రం రాలేనని చెప్పడానికి. కోయంబత్తూరు వెళ్ళాలి-తప్పనిసరిగా...మీరు అంగీకారం చెప్పేస్తే సంతోషంగా వెళ్ళి వొస్తాను" అన్నాడు-ఏదో చిన్న విషయంలో అడుగుతోన్నట్టు.

"మీరు తిరిగి వొచ్చాక..."

"ఆలోచన తెగలేదా ?"

"నిజానికి-తెగలేదు."

"ఏమైనా కావాలంటే అడగండి-చెప్తాను."

"ఆదేమీలేదు..."

"మరి ? ఎవరైనా మిమ్మల్ని ముందర అడిగారా ?"

"అదికాదు"

"అమ్మా నాన్నా అడ్డంకులు పెడతారా ? అడ్రస్ ఇవ్వండి. నేను వెళ్ళి మాట్లాడతాను."

"ఎవ్వరూ లేరు నాకు-ఉన్నవాళ్ళని అడిగే అవసరంలేదు."

"మరి ? నేను నచ్చలేదా ?"

" ఆలోచించుకోనివ్వండి " అంది చిరునవ్వు ప్రతిధ్వనించే స్వరంతో. జలపాతంలాగా వేస్తున్నాడు ప్రశ్నలు...

"సారీ! నాకు తొందర ఎక్కువ. క్షమించండి...ఎల్లుండి ఆరు గంటలకి ఇంటికి వొస్తాను...సరేనా ?"

"సరే..." అంది రేఖ

"మీరు అవునంటే వారం రోజుల్లో-ఆల్‌రైట్...ఎల్లుండి" అని, నవ్వుతూ ఫోను పెట్టేశాడు గోపాల్.

ఆ సాయంత్రం అరగంటసేపు జీవన్‌తో గడిపింది రేఖ-ఆ రోజుల్లో తన జీవితంమీద అధికారం అంతా జీవన్‌కే ఉన్నట్టు ప్రవర్తించేదితాను.

"అతన్ని గురించి కనుక్కున్నాను" అన్నాడు జీవన్ ఉపోద్ఘాతం లేకుండా.

రేఖ మాట్లాడలేదు.

"చాలా మంచిపేరు ఉంది. ప్రాస్పెక్ట్స్ ఉన్నాయి ... చాలా గట్టివాడుట-

కొంచెం తొందరపడే స్వభావం. అంతే."

రేఖ వింటోంది.

"అతను నీ కెలాగ కలిశాడు?" అన్నాడు జీవన్.

రేఖ చెప్పింది.

నవ్వి "నేను లేనప్పుడు జరిగింది ఇదా?" అన్నాడు.

"అనుకోకుండా జరిగింది...మిమ్మల్ని అడిగి సలహా తీసుకోకుండా ఏమీ చెయ్యను" అంది రేఖ.

చాలా సేపు ఆలోచనలో పడ్డాడు జీవన్.

చివరకి... "నీకూ నాకూ మధ్య ఉన్నది...ఎప్పటికీ చెరగదు-"అన్నాడు.

తల ఊపింది రేఖ.

"నేను స్వార్థంతో నీ జీవితాన్ని పాడుచెయ్యలేను...నీ కిష్టం అయితే అతన్ని తప్పక చేసుకో..." అన్నాడు.

పెద్ద బరువు దింపినట్టు ఉంది రేఖకి.

"కాని, తరవాత కూడా నాకెప్పుడైనా కనిపిస్తూ ఉండు ఇలాగ-రకరకాల బాధల్లో నువ్వే నాకు కొంచెం ఓదార్పు" అన్నాడు జీవన్.

"నాకు తెలుసును" అంది రేఖ. తనదీ జీవన్‌దీ ఒక ఉన్నతమైన స్నేహం. దానిలో సిగ్గుపడాల్సిందీ, దాచుకోవలసిందీ ఏమీలేదు-అంచేత జీవన్ కోరికని కాదనక్కరలేదు...మాలతి మాత్రం అలాగ కాదంటుంది-అందరూ అనుకొనేదే నిజం...నిజమైన నిజం నిజం కాదంటుంది...

"మీ గోపాల్‌కి...మన పరిచయం విషయం తెలీనీకు-మనుషులు సులువుగా అపార్థం చేసుకుంటారు."

అలాగేనంది రేఖ.

"మా ఆవిడ నా కదలికలు జాగ్రత్తగా గమనిస్తోంది-త్వరగా ఇంటికి వెళ్లాలి. టేక్సీలో వెళ్దాం..." అన్నాడు జీవన్. ఆమె అనుమానాలని గురించి అతను తరుచు చెప్తూనే ఉంటాడు.

ఆ మూడోరోజున ఆరుగంటలకి వొచ్చేడు గోపాల్.

వొస్తూనే, "ఏం చేశారు?" అన్నాడు.

"కూర్చొండి...కాఫీ తాగండి" అంది రేఖ...మాలతి ఇంట్లోనే ఉంది. పరిచయం చేసింది.

"కాఫీ తాగుతాను - ముందర అసలు విషయం చెప్పెయ్యండి" అన్నాడు




గోపాల్.

మాలతి నవ్వుతూ, "మీ రెప్పుడూ ఇంతేనా? లేక ఈ విషయంలోనే ఇంత తొందరా?" అంది.

ఆమెతో నవ్వుతూ, "మంచి మంచి విషయాలన్నిటిలోనూ నాకు తొందరే" అన్నాడు.

"తొందరే కాదు—అట్టే ఆలోచించరనుకుంటాను" అంది మాలతి.

"ఏం? అలాగ అంటారు?" అన్నాడు గోపాల్.

"రేఖ చిరునవ్వుతో మీ కేమీ కనిపించలేదా?" అంది మాలతి నవ్వుతూనే.

అప్పుడే కాఫీ తెస్తోంది రేఖ.

కుర్చీలోనించి ఎగిరి లేచి, "రేఖా! మీరు నాకెంతగా నచ్చేరో తెలుసా? ఈ రెండు రోజులూ నిద్రపోలేదు నేను!" అంటూ ఆమెని కౌగలించుకున్నాడు.

ఆమె చేతిలోని కాఫీ కప్ క్రిందని పడింది.

అందరూ తెల్లబోయి చూశారు.

"సారీ!...కాని, ఇది శుభ సూచకం!...రేఖా! మీరు..."అని ఏదో అనబోయాడు.

"మళ్ళీ తెస్తాను" అని లోపలికి వెళ్ళబోయింది రేఖ.

"వొద్దు" అంటూ ఆమెని ఆపేడు గోపాల్. "కాఫీ తాగాలని లేదు. మీరిద్దరూ రండి...ఇవేళ సెలబ్రేట్ చేద్దాం" అన్నాడు గోపాల్. అతని కళ్ళలో కాంతి రేఖకి ఈనాడూ జ్ఞాపకం ఉంది.

తాను మందలించేదాకా మీరు అంటూనే మాటలాడేడు గోపాల్.

మరో పదిరోజుల్లో ముహూర్తం.

అంతా కలలాగ అయిపోయింది.

తరవాత...

తన వైవాహిక జీవితం, గోపాల్‌తో. ముందర తన ఉద్దేశాలలోకి అతని గాఢమైన ప్రేమరాలేదు...సామాన్యంగానే తమ జీవితం గడిచిపోతుందనీ,జీవన్‌ని అలాగ దూర దూరంనించే ఆరాధించవొచ్చుననీ ఆమె అనుకుంది. పెళ్ళికి ముందుండే ఉత్సాహం గోపాల్‌లో తగ్గకపోవడం.నిజానికి దినదినమూ అతని అనురాగం హెచ్చడం మరికొన్ని సమస్యలని తెచ్చిపెట్టింది.క్రమంగా గోపాల్ మీద ఆమెకి మమత హెచ్చుకాసాగింది...వొద్దు వొద్దనుకున్నా అతన్ని ప్రేమించకుండా ఉండలేకపోతోంది...తన కోసం, తన ఆనందం కోసం అతని తహతహ ఆమెని పూర్తిగా కరిగించేసింది.

ఈ మధ్య జరిగిన ఒక్కొక్క సంఘటనా ఆమెని మరీ కదిలించింది-తన కోసం అతనేమైనా చేస్తాడు.

"ఏమిటంత తీవ్రంగా ఆలోచిస్తున్నావు?" అన్నాడు గోపాల్, లేచి కూర్చుంటూ.

"మామూలే..." అంది రేఖ తానూ లేస్తూ.

"అవును...కాని, నా దగ్గర దాచి నన్నెందుకు బాధపెడతావు?" అన్నాడు గోపాల్ ఆమె చేతిని తీసుకుని ఇంటి లోపలికి నడిపిస్తూ."నీ కన్న నాకెవరూ లేరు...నీకూ, అలాగే అనిపించాలి—నీ బాధ ఏదైనా సరే...నాతో చెప్పు అన్నాడు సానునయంగా.

ఆమె ఆగిపోయింది.

"మన మధ్య ఎంత పలచటిదైనా సరే...తెరలు ఉండకూడదు" అన్నాడు గోపాల్ మృదువుగా.

ఆపుకోలేని కన్నీళ్ళు ఒక్కసారి వెలికి వొచ్చాయి ఆమెకి. అతని గుండెల మీద వాలి, తన కన్నీళ్ళని ఆపుకుంది.

అతను ఆమెని లోపలికి తీసికెళ్ళేడు.

ఆ క్షణాలలో తన మనసులోని మధన అంతా అతనికి చెప్పి తేలికపడదామని సిద్ధమయింది రేఖ. కాని ఎవరో వొచ్చారు. కారు బయట ఆగింది. డోర్ బెల్.

అతను ఆమె చెంపలునిమిరి, "బాధపడకు...నేను ఉన్నాను" అని డ్రాయింగ్ రూములోకి వెళ్లేడు.

ఆమెబెడ్ రూమ్‌లోకి నడిచింది.

డ్రెస్సింగ్ టేబిల్‌మీద ముద్దొస్తూ గులాబులు...టైగర్ పెట్టి ఉంటాడు. వాసన చూసింది. చేతుల్లోకి తీసుకుంది. ఒక ముల్లు గుచ్చుకుంది.

అద్దంలో చూసుకుంది.

కళ్ళు ఎర్రగా ఉన్నాయి. అద్దం ముందు ఆ నాటి కార్డు అలాగే ఉంది.
'ఐ లౌ యు.'

'నేనూ నిన్ను ప్రేమిస్తున్నాను...వొద్దనుకుంటూనే, అవధులులేని విధంగా, నీతో ప్రేమలో పడ్డాను' అనుకుంది రేఖ. ఆ క్షణంలో అతనక్కడ ఉంటే ఆ మాట చెప్పేది.

త్వరగా ముఖం కడుక్కుంది. మళ్ళీ తాజాగా తయారై, టీ ట్రే పట్టుకుని డ్రాయింగ్ రూమ్‌లోకి వెళ్ళింది...గోపాల్‌ని చూడాలనిపించింది, మరి.

"ఈయన మా డైరెక్టర్..." అంటూ రావ్‌ని పరిచయం చేశాడు.

లాంఛనాలయి టీ తాగుతూ, "మీ ఆయనని ఒప్పించడానికి వొచ్చేను... ఆయన ఏం చేశాడో తెలుసుగా !" అన్నాడు లాల్.

మౌనంగా తల ఊపింది.

"ఈయన అడిగినదంతా చెయ్యడానికి మేము సిద్ధమే-కాని, ఇంకా నలుగురున్నారు...అందరికీ అలాగే చెయ్యాలి" అన్నాడు లాల్. ఆగి, టీ సిప్ చేసి, "మీరైనా చెప్పండి...అక్కడినించి తిరిగి రాగానే మాకు ఈయనే వర్క్సు మేనేజరు అవాలి !" అన్నాడు.

గోపాల్ కూడా ఆ వార్తవిని ఆశ్చర్యపడ్డాడు. రేఖ ఏమీ అనలేదు.

"మీరు...నాకు సహాయంచేసి ఈయనకి చెప్పండి" అన్నాడు లాల్.

"ఆయన ఇష్టం...ఏం చేసినా నాకు సమ్మతమే" అంది రేఖ.

లాల్ నవ్వుతూ, "గోపాల్ ! చాలా అదృష్టవంతులు మీరు." అన్నాడు.

గంభీరంగా, "అది నిజం" అన్నాడు రేఖ వేపు చూస్తూ, గోపాల్.

లాల్ లేచి, జేబులోనించి గోపాల్ రెజిగ్నేషన్ ఉత్తరం ఆమె కిచ్చి, "దయచేసి ఆలోచించండి...వొచ్చేసారి మీరిద్దరూ అమెరికా వెడతారని వాగ్దానం చేస్తున్నాను...మంచి ఇంజనీర్లని వొదులుకునేవాళ్ళం మేము కాదు" అని, సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు లాల్.

"ఏమంటావు రేఖా ?" అన్నాడు గోపాల్.

రేఖ కాగితం చిన్న చిన్న ముక్కలుగా చింపేసింది...

అతను జాగ్రత్తగా వాటిని అవతల పడవేశాడు.

* * *

మరునాడు సాయంత్రం అతనికోసం ఎదురుచూస్తూ కూర్చుంది రేఖ. ప్రతి నిమిషమూ లెఖ్ఖపెడుతోంది.

తొమ్మిదయ్యాక అలిసిపోయి వొచ్చాడు.

రెండురోజుల పని ఒక్కరోజులో చెయ్యవలసి వొచ్చింది కాబోలు. అతని

అలసటనంతనీ తనమీద తీసుకోవాలనిపించింది.

స్నానంచేసి వొచ్చి తల దువ్వుకుంటూ అతను అద్దంమీద కార్డు చూశాడు. తను రాసినదే మళ్ళీ ఆ పంక్తి కిందనే రాసి ఉంది.

ఆ దస్తూరి ఎవరిదో అతనికి తెలుసును.

* * *

"నువ్వు లేకుండా అమెరికా వెళ్ళడం-నాకేమీ బాగులేదు...డబ్బు పోతే పోనీ...ఇద్దరమూ వెడదాము" అన్నాడు గోపాల్.

చిరునవ్వుతో, "చూద్దాం లెండి..." అంది రేఖ.

"కాదు-అలాగే చేద్దాం" అన్నాడు గోపాల్. అతని కీ ఉద్దేశం బాగానచ్చింది. "నువ్వు లేకపోతే అక్కడ నాకు గడవదు...అడిగితే ఆ మాత్రం లోన్ ఇవ్వక పోరు..." అన్నాడు.

"నా దగ్గర-చాలా ఉంది" అంది రేఖ.

"ఉండనీ-నేను నిన్ను తీసికెళ్ళాలని కాని, నువ్వు రాలేవని కాదు" అన్నాడు గోపాల్-ఇంక చర్చ అనవసరం అన్నట్టు.

"అదంతా-మీదే" అంది రేఖ.

"నువ్వే నాది !" అన్నాడు గోపాల్ ఆమెని దగ్గరగా తీసుకుంటూ...పది నిముషాలు మధురంగా గడిచాయి.

అర్థం లేకుండా, జీవన్ జ్ఞాపకం వొచ్చాడు రేఖకి. క్షణికంగా బిగుసుకు పోయింది.

ఆమె గుండెలోని ప్రతీ స్పందననీ జాగ్రత్తగా తెలుసుకుంటూన్న గోపాల్ ఆమె ముఖం ఎత్తి కళ్ళల్లోకి చూస్తూ, "ఏమిటయింది ?" అన్నాడు.

ఏమీ లేదని తల ఊపింది.

"కాదు...చెప్పు..."

లాలనలో పూర్తిగా కరిగిపోయింది రేఖ.

ఒకటీ ఒకటీ...

తన జీవితం...

జరిగినదంతా, వివరాలతో చెప్పింది.

అతని ముందు, ఏమీ దాచుకోకుండా చెప్పింది. చివరికి బర్త్‌డేనాటి గొలుసు మాట కూడా...ఆ తరువాతి సాయంత్రం-తనకి జరిగినది...అంతా.

నిజం. నిజంగా. అంతా.

హృదయం కడిగి కడిగి, చెప్పింది.

ఏమీ దాచుకోకుండా, తాను ప్రేమించిన, ప్రేమిస్తోన్న తన దైవం ముందు అన్నీ చెప్పేసింది రేఖ.

అన్నీ విని చాలాసేపు ఏమీ అనలేదు గోపాల్.

భయంకరమైననిశ్శబ్దం గదిని ఆవరించింది.

అతని గుండెలమీద పడుకుని ఉంది రేఖ.

హటాత్తుగా ఆమెని తోసి, లేచి కూర్చున్నాడు గోపాల్. అతని ముఖం వికృతంగా ఉంది. కళ్ళు ఎర్రగా ఉన్నాయి.

"ఆ గొలుసు...తే" అన్నాడు-గొంతుక పోతూ పోతూ ఉన్నట్టు

తెల్లబోయి చూసింది రేఖ.

"తే" అన్నాడు. మార్దవం లేదా ఆజ్ఞలో.

నిద్రలో నడుస్తూన్నట్టు వెళ్ళి తెచ్చింది.

నిలబడి ఆమె మెడలో వేశాడు.

ఏమి జరుగుతోందో బోధపడక అలాగే చూస్తోంది.

"వెళ్ళు" అన్నాడు.

ఆమె కదల్లేదు. తన ప్రపంచం శిథిలాలై, తన చుట్టూ అవి వర్షిస్తోన్న మాటని ఆమె నమ్మలేకపోతోంది.

"గెటవుట్."

ఆమె కదల్లేదు.

కదలలేకపోతోంది

"అవును-ఈ ఇల్లు నీది. మరిచిపోయాను..."

అతను లేచి త్వరత్వరగా బట్టలు వేసుకుంటున్నాడు.

సూట్ కేసులు రెండిటిలో తన బట్టలూ, సామాన్లూ వేసుకుంటున్నాడు.

"నిజం చెప్పేను మీకు" అంది రెఖ, అంతా చూస్తూ.

"నాలో చాలా మూర్ఖత్వం ఉంది...కాని, అది నమ్మేంతలేదు" అన్నాడు గోపాల్ కర్కశంగా.

"నా మాట నమ్మండి...మిమ్మల్ని మోసం చెయ్యలేను" అంది రేఖ... కన్నీళ్ళైనా రావడంలేదు.

"వొద్దులే-నన్ను మార్చే ప్రయత్నం చెయ్యకు...నీ వెనక ఇంత చరిత్ర ఉందని తెలీదు...వెడతాను" అన్నాడు గోపాల్. సూట్ కేసులు బయటపెట్టి కారు తెచ్చి డిక్కీలో వేశాడు.

"ఇంత రాత్రి...ఎక్కడికి?" అంది రేఖ.

"ఎక్కడికో!...నాకూ స్నేహితులున్నారు...ఊరిలో హోటళ్ళు ఉన్నాయి. నా గురించి బాధపడకు" అన్నాడు గోపాల్ కారులో కూర్చుని డోర్ వేస్తూ.

కారు వెళ్ళిపోయింది.

ఎర్ర దీపాలు మాయం అయిపోయాయి.

చాలా సేపలాగే నిలబడి, లోపలికి వెళ్ళి తలుపు వేసుకుంటూంటే ఆమెకి మరోసారి తన జీవిత నాటకంలో తెర వేసినట్లయింది.

ఇల్లంతా వెలవెల బోతోంది.

బెడ్ వెక్కిరిస్తోంది.

నలిగిన దుప్పటీ; దిండు...

కొంచెంసేపటి కిందట అక్కడ జరిగిన కథ.

తాను నిజం చెప్పింది.

అంతగా ప్రేమించిందతన్ని.

* * *

కిటికీ దగ్గర కుర్చీలో కూర్చుని బయట చీకటిలోకి చూస్తూ చాలాసేపు గడిపింది రేఖ.

నిద్ర రాలేదు.

అలసట తెలీలేదు.

ఈ రాత్రి తన ఇంటి ముందు అతని కారు ఆగదు.

ఈ రాత్రి అతని గొంతుక టెలిఫోన్‌లో నయినా వినిపించదు

కాని రేపు ?

ఎల్లుండి ?

ఆ తరవాత ?

లేచి వెళ్ళి డ్రెస్సింగ్ టేబిల్ మీది గులాబులని దోసిలిలో ఉంచుకుని వొచ్చి, మళ్ళీ కూర్చుంది రేఖ. తనకి వాటి ముళ్ళు గుచ్చుకుంటాయనే ఆలోచన లాతేదామెకి.

బాధగా, ముద్దు పెట్టుకున్నట్టు రేఖ వాటిని వాసన చూసి, బయటికివిసిరి, మళ్ళీ కిటికీలోనించి చూస్తూ కూర్చుంది.